


ప్రభుత్వాలపై 'సమర భేరి'

- నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా



ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

అటు కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం, ఇటు రాష్ట్రంలోని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ముందుకు సాగుతున్నాయి. అన్నింటి ధరలూ విపరీతంగా పెంచేస్తున్నాయి. కేంద్రంలోని మోడీ సర్కార్ పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచేసింది. వాటి ఫలితంగా నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని అంటాయి. రాష్ట్రంలోని జగన్ సర్కార్ కూడా అదే బాటలో ముందుకు సాగుతోంది. విద్యుత్ చార్జీలు పెంచింది. ప్రజలపై మోయలేని భారాలను వేస్తోంది. ఆస్తి పన్ను పెంచింది. చెత్త పన్ను పేరుతో అదనంగా వసూలు చేస్తోంది. వాటితో పాటు రెండు ప్రభుత్వాలూ కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను వేగంగా అమలు చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సమర భేరి పేరుతో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలను, ప్రభుత్వాల వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. రెండు రోజుల పాటు జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం సమస్యలపై సచివాలయాల ముందు ధర్నాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. 4న మండల కేంద్రాలు, జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని ఎండగట్టనున్నారు.

మండుతున్న గ్యాస్ ధర..

మోడీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు వినియోగానికి వాడే 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.450 ఉండగా అది ఏకంగా రూ.1144.5కు చేరింది. గృహ అవసరాలకు వినియోగించే 14.2 కిలోల వంట గ్యాస్ ధర 14 నెలల కాలంలో నెలల్లో ఏకంగా రూ.256 మేర పెరిగింది. సిలిండర్ ధర గత ఏడాది జనవరిలో రూ.748.5 ఉండగా రూ.75.50 పెంచారు. దాంతో రూ.824కు చేరింది. మార్చిలో మళ్లీ రూ.50 పెంచడంతో రూ.874కు పెరిగింది. ఏప్రిల్‌లో రూ.10 తగ్గి రూ.864కు చేరింది. జులైలో మళ్లీ రూ.25.5 పెరగడంతో రూ.889.5కు, ఆగష్టులో రూ.25 పెరగడంతో 914.5కు, తరువాత సెప్టెంబర్‌లో రూ.25, అక్టోబర్‌లో రూ.15 పెంచడంతో రూ.954.5కు చేరింది. తరువాత రూ.50 పెంపుతో రూ.1004.5కు చేరింది. మరో వైపు వంట గ్యాస్ సబ్సిడీని కూడా గాలికి వదిలేశారు. తాజాగా రక్షా బంధన్ కానుకగా రూ.200 గ్యాస్ సిలిండర్ మీద తగ్గించినట్లు కేంద్ర ప్రభుత్వం చెబుతోంది.

పెట్రోల్, డీజిల్ మంట

ఎక్సైజ్ సుంకం పేరుతో వేస్తున్న బాదుడుతో పెట్రోల్, డీజిల్ ధరలు రోజు రోజుకూ పెరుగుతూ పోతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యాట్ పేరుతో పన్ను పెంచుకుంటూ పోతుండటంతో లీటరు పెట్రోల్ ప్రస్తుతం రూ.112.51 కు చేరింది. లీటరు డీజిల్ ధర రూ.100.27కు పెరిగింది.

బస్ ఛార్జీల బాదుడు

డీజిల్ సెస్ పేరుతో టికెట్(మనిషికి) మీద పల్లె వెలుగు బస్సుల్లో రూ.2, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రూ.5, సూపర్ లగ్జరీ, ఎసి బస్సుల్లో రూ.10 ఛార్జీ పెంచారు. పెంచిన డీజిల్ సెస్‌తో కలిపి పల్లె వెలుగులో కనీస ఛార్జీని రూ.10కి పెంచారు. దీంతో పాటు పలు బస్సు సర్వీసుల్లోనూ కిలో మీటరు మీద కూడా ఛార్జీలను పెంచారు. పల్లె వెలుగు, ఇంద్ర, గరుడ, అమరావతి, నైట్ రైడర్ సర్వీసుల్లో కిలో మీటర్ల మీద కూడా ఛార్జీలను పెంచారు.

కరెంట్ బిల్లుల షాక్

విద్యుత్ ఛార్జీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం పెంచింది. పెంచిన ధరలు ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చాయి. 30 యూనిట్లలోపు వినియోగదారులకు యూనిట్‌పై 45 పైసలు, 31 నుంచి 75 మధ్య వారికి 91 పైసలు, 76 నుంచి 125 మధ్య వారికి రూ.1.40 పెరిగింది. 126 నుంచి 225 మధ్య వారికి యూనిట్‌కు రూ.1.50 చొప్పున, 226 నుంచి 400 మధ్య వారికి రూ.1.16 చొప్పున, 400 యూనిట్లపైన వాడే వారికి 55 పైసల చొప్పున విద్యుత్ ఛార్జీలు పెరిగాయి. శ్లాబుల విధానాన్ని తీసుకొచ్చారు. 6 శ్లాబులుగా విద్యుత్ బిల్లులను విభజించారు.

మహిళ రక్షణే ధ్యేయం

- దిశ యాప్‌తో మరింత చేరువగా పోలీస్ సేవలు
- ప్రజాశక్తితో దిశ డిఎస్‌పి ఐ.సుధాకర్ రెడ్డి

మహిళల రక్షణ ప్రధాన ధ్యేయంగా దిశ మహిళ పోలీస్ స్టేషన్ పనిచేస్తుందని దిశ డిఎస్‌పి ఐ.సుధాకర్ రెడ్డి అన్నారు. దిశ పోలీస్ స్టేషన్ ద్వారా మహిళలకు అందుతున్న సేవలను గురించి ప్రజాశక్తి ముఖాముఖి లో ఆయనను పలకరించగా పలు విషయాలను ఆయన వెల్లడించారు..



ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

దిశ పోలీస్ స్టేషన్ ద్వారా మహిళలకు ఎలాంటి రక్షణ కల్పిస్తున్నారు?

డిఎస్‌పి : దిశ పోలీస్ స్టేషన్‌ను ప్రత్యేకంగా మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రోజు రోజుకు మహిళలపై దాడులు అఘాయిత్యాలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో మహిళలు వేధింపులకు దాడులకు హత్యలకు గురవుతున్న సంగతి తెలిసిందే. అలాంటి నేరాల నుంచి మహిళలకు సంపూర్ణ రక్షణను కల్పించేందుకు ప్రభుత్వం సరికొత్త పోలీస్ విధానాన్ని ముందుకు తెచ్చింది. అందులో భాగమే దిశ యాప్ ఏర్పాటు.

దిశ యాప్ ప్రాముఖ్యత ఏమిటి?

డిఎస్‌పి : దిశ యాప్ ఏర్పాటు చేయడం వల్ల సెల్ ఫోన్ కలిగి ఉన్న ప్రతి ఒక్క మహిళకు పోలీస్ సేవ మరింత చేరువయ్యింది. ప్రతి ఒక్క మహిళ ఈ యాప్‌ను తమ ఫోన్లలో రిజిస్టర్ చేసుకోవాలి. యాప్ ద్వారా దిశ పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేసి చెప్పడం లేదా ఎస్‌ఓఎస్ విధానంలో గాని లేదా డైల్ 100కు ఫోన్ చేసి సమస్యను తెలియజేస్తే ఈ యాప్ ద్వారా పోలీసులకు బాధిత మహిళ ఉన్న ప్రదేశం ఫోన్ ట్రాక్ ద్వారా గుర్తించవచ్చు. అతి తక్కువ సమయంలోనే పోలీసులు బాధితురాలు ఉన్న నిర్ణీత ప్రదేశానికి చేరుకునే అవకాశం, నేరాన్ని నియంత్రించే అవకాశం మెండుగా ఉంది.

దిశ యాప్ గురించి మహిళలకు ఎలాంటి అవగాహనను కల్పిస్తున్నారు?

డిఎస్‌పి : దిశ యాప్ ను గురించి మహిళల్లో అవగాహనను పెంపొందించడానికి అన్ని ప్రదేశాల్లో పోలీసులు ప్రత్యేక కృషిని నిర్వహించారు. గ్రామాల్లో స్వయం సహాయక గ్రూపుల్లో యాప్ వినియోగాన్ని, రిజిస్ట్రేషన్‌ను గురించి వివరించారు. పోలీసులు కళా బృందాలుగా వివిధ నాటిక ప్రదర్శనలు నిర్వహించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాం.

స్టేషనుకు ఎలాంటి కేసులు అధికంగా వస్తున్నాయి?

డిఎస్‌పి దిశ స్టేషన్ కు అత్యధికంగా భార్యాభర్తల వివాదాలు తరచుగావస్తున్నాయి. వీటితో పాటు గృహహింస, వరకట్న వేధింపులు, ఈవ్ టీజింగ్ ఫిర్యాదులు వస్తున్నాయి. భార్యాభర్తల కేసులు అయితే ఇరు పార్టీలను పిలిపించి మొదటగా సమస్య సద్దుమణిగే దిశగా ఫ్యామిలీ కౌన్సిలింగ్ ఇస్తాం. తదుపరి సమస్య జటిలంగా ఉందనిపిస్తే నిందితులపై కేసు నమోదు చేసి కోర్టుకు పంపుతాం.

కుటుంబాల మధ్య వస్తున్న వివాదాలపై మీకున్న భావన ఏమిటి?

డిఎస్‌పి : ఇటీవల కాలంలో భార్యాభర్తల మధ్య వివాదాలు పెద్ద ఎత్తున చోటు చేసుకుంటున్నాయి. మహిళల విషయంలో వేధింపులు ఉండటం వాస్తవమే. కొన్ని వివాదాల్లో భార్యాభర్తల మధ్య అవగాహన లోపంతో పాటు అపార్థాలు, అనుమానాలు, గర్వపూరిత మనస్తత్వం వంటి అంశాలు కూడా వివాదాలకు దారితీస్తున్నాయి.

వీటిని అరికట్టడానికి మీరిచ్చే సలహా ఏమిటి?

డిఎస్‌పి : పెళ్లికి ముందు వరుడు, వధువుకు సంబంధించిన అన్ని విషయాలను సమగ్రంగా పరిశీలించుకోవాలి. ఈ మధ్యకాలంలో సెల్ఫోన్లలో సామాజిక మాధ్యమాలు పరిచయాలను కూడా సరైన పద్ధతిలో వినియోగించుకోవాలి. లేదంటే సమస్యను తెచ్చిపెట్టే అవకాశాలు ఉన్నాయి. పరిధికి మించి వ్యవహరించకపోవడం మంచిది.



జిఎంఆర్ సర్వే 100శాతం పూర్తి కావాలి

- జిల్లా ఇన్చార్జి కలెక్టర్ నారపరెడ్డి మౌర్య



ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలోని అన్ని మండలాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత విద్యలో బడి ఈడు పిల్లల నమోదు (గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో) జిఎంఆర్ ఖచ్చితమైన సర్వే 100 శాతం పూర్తి చేయాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ నారపరెడ్డి మౌర్య విద్యాశాఖ అధికారులను టెలికాన్ఫరెన్స్ లో ఆదేశించారు. ఆదివారం దూపాడు కెవి సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో మండల విద్యాశాఖ అధికారులు, సిఆర్‌పిలు, ఎంఐఎస్, డిటిపిలతో నిర్వహిస్తున్న బడి ఈడు పిల్లల స్థూల నమోదు నిష్పత్తిపై (గ్రాస్ ఎన్రోల్మెంట్ సర్వే) వర్క్ షాప్ నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారిని , సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారిని టెలి కాన్ఫరెన్స్ లో ఆదేశించారు. నారపరెడ్డి మౌర్య మాట్లాడుతూ జిల్లాలో బడి బయట ఉన్న 15 నుండి 18 సంవత్సరాలలోపు బడి ఈడు పిల్లల నమోదు (గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో) చైల్డ్ ఇన్ఫోలో నమోదు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పాలిటెక్నిక్, జూనియర్ కళాశాల, ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ లను ఆదేశించారు. పాలిటెక్నిక్ కాలేజీ చైల్డ్ ఇన్ఫోకు సంబంధించి యూజర్ ఐడి, పాస్వర్డ్ వచ్చిందని రెండు రోజుల్లో గుర్తించిన పిల్లలందరిని చేర్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. జిల్లాలో ఇంకా 31,600 మంది పిల్లల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ సర్వే పెండింగ్ లో ఉందని మండల విద్యాధికారులు, పాలిటెక్నిక్, జూనియర్ కళాశాల, ఐటిఐ కళాశాలల అధ్యాపక సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చైల్డ్ ఇన్ఫోలో బడి ఈడు పిల్లల నమోదు (గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో) 100 శాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. డిఇఒ రంగారెడ్డి సమగ్ర శిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ వేణుగోపాల్ , వర్క్ షాప్ ను పర్యవేక్షించారు. వర్క్ షాప్ లో మండల విద్యాశాఖ అధికారులు , సిఆర్పిలు, ఎంఐఎస్, డిటిపిలు పాల్గొన్నారు.

ముగ్గురు అధ్యాపకులకు రాష్ట్రస్థాయి పురస్కారాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు జిల్లాకు చెందిన ముగ్గురు అధ్యాపకులకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించింది. ఈ ముగ్గురికి ఈనెల 5న విశాఖపట్నంలో జరిగే ఉపాధ్యాయ దినోత్సవం లో భాగంగా పురస్కారాలను అందుకోనున్నారు. సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు డాక్టర్ అక్తరు భాను ఇంగ్లీషు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు.డాక్టర్ ఎం. ఫామిద బేగం, తెలుగు శాఖ హెచ్‌ఒడిగా సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాల, కర్నూలులో తమ వృత్తిని నిర్వహిస్తున్నారు. ఫర్మెన్ కళాశాలకు చెందిన బయోటెక్నాలజీ హెచ్‌ఒడి డాక్టర్ ఇంద్రావతి ఎంపికయ్యారు.



డాక్టర్ ఇంద్రావతి



డాక్టర్ అక్తర్‌భాను



పమీదాబేగం

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

అర్బన్ హెల్త్ సెంటర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు గౌస్‌దేశాయి



మాట్లాడుతున్న యాకోబు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అర్బన్ హెల్త్ సెంటర్లో పనిచేసే ఉద్యోగస్తులు అందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అర్బన్ హెల్త్ సెంటర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు డి.గౌస్ దేశాయ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో అర్బన్ హెల్త్ సెంటర్స్ ఎంప్లాయిస్ యూనియన్ కర్నూలు జిల్లా కమిటీ సమావేశం యూనియన్ రాష్ట్ర కోశాధికారి యాకోబు అధ్యక్షతన నిర్వహించారు. గౌస్ దేశాయ్ మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్‌లో పనిచేసే అన్ని కేడర్ల ఉద్యోగులు కలిసి ఐకమత్యంగా ఉండి తమ డిమాండ్ల సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. యూనియన్ అధ్యక్షులు భీమన్న ప్రధాన కార్యదర్శి నూర్‌బాషా మాట్లాడుతూ 60 జీవో ప్రకారం వేతనాలు మంచిగా ఉండేవని, మళ్లీ 64 జీవో ద్వారా ఫార్మా ఎల్టి స్టాఫ్ నర్స్ జీతాలు తగ్గిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు సేవ చేస్తున్న మాలాంటి వారికి అమలు చేసే ఆదుకోవాలని వారు కోరారు. మా సమస్యలు ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే యూనియన్ గా దశల వారి ఆందోళనలు చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్ల జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

అర్బన్ హెల్త్ సెంటర్స్ యూనియన్ నూతన జిల్లా కమిటీ అధ్యక్షులుగా భీమన్న, ప్రధాన కార్యదర్శిగా నూర్ బాషా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విజయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సాయికుమార్, ట్రెజరర్‌గా చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా పెద్దయ్య, సైదా, ముబీన, కల్పన, వెంకటేష్, రామకృష్ణ, జాయింట్ సెక్రటరీగా వీరభద్రుడు, మృధుల, గోవిందమ్మ, ఆఫ్రిన్, సరోజలతోపాటు జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.



క్రీడాకారినిని అభినందిస్తున్న తాలూకా సిపిఐ శ్రీరామ్

తైక్వాండో విజేతలకు తాలుకా సిఐ అభినందన

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

గత నెల 26, 27వ తేదీలలో బెంగళూరులో జరిగిన వెస్టర్స్ కప్ మొదటి జాతీయ ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్ కివిరగీ, పుంసే, డెమో పోటీలలో బంగారు పతకాలను సాధించిన కర్నూల్ నగరానికి చెందిన క్రీడాకారులను కర్నూలు తాలూకా సిఐ శ్రీరామ్ అభినందించారు. ఆదివారం కర్నూలు నగరంలోని వీకర్‌సెక్షన్ కాలనీలో ఉన్న పుచ్చలపల్లి సుందరయ్య పార్కు ఆవరణలో అభినందన కార్యక్రమం నిర్వ హించారు. ముఖ్య అతిథిగా తాలూకా సిఐ శ్రీరామ్, ప్రజాశక్తి దినపత్రిక జనరల్ మేనేజర్ నరసింహ, ఎడిషన్ ఇన్‌ఛార్జి పి.చంద్రయ్య హాజరయ్యారు. సిఐ మాట్లాడుతూ తానూ కూడా తైక్వాండో ప్లేయర్‌నని, రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేసే వాడనని తెలిపారు. తైక్వాండో క్రీడ సాధన చేయడం వల్ల పోలీస్ ఉద్యోగానికి ఎంతో దోహదపడిందని చెప్పారు. ఈ ప్రాంత విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధిం చడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు సుగంధిని, మౌనిక, రాధిక, విభ, సాధికా సదఫ్, పవన్, రంజిత్, లోకి, రిహాన్, సుహాన్, రేవంత్‌లు బంగారు పతకాలు సాధించారు. తైక్వాండో శిక్షకులు జి.షబ్బీర్ హుస్సేన్, క్రీడాకారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మైత్రి హాస్పిటల్‌లో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూల్ నగరం గాయత్రి ఎస్టేట్ లోని మైత్రి హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు మేనేజర్ కృష్ణ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు బిఎండి టెస్ట్, జిఇఆర్‌డి, న్యూరోపతి టెస్ట్, ఎముకల పటుత్వ సాంద్రత పరీక్ష, గ్యాస్టిక్ ట్రబుల్ సమస్యను కనుగొను పరీక్ష, నరాల పటుత్వ పరీక్షలను నిర్వహించారు. రూ.500 న్యూరోపతి టెస్టు, రూ. 1500 విలువగల పరీక్షలు ఉచితంగా చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరం లో వైద్యులు డాక్టర్ వినోద్, డాక్టర్ శ్రీకర్ పాల్గొన్నారు.

పోల రామాంజనేయులు మృతి తీరని లోటు

ఎపి చేతివృత్తిదారుల సంఘం సంతాపం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ :ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా ఉన్న పోల రామాంజనేయులు అకాల మరణం చేనేత కార్మిక సంఘానికి, చేతి వృత్తి రంగాలకు తీరని నష్టమని ఎపి చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ, ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం కర్నూలు జిల్లా కమిటీ వృత్తి సంఘాల సీనియర్ నాయకులు జెఎన్. శేషయ్య, వృత్తి సంఘాల జిల్లా కన్వీనర్ సి.గురు శేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారితో పాటు చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రాజు, లక్ష్మన్న జిల్లా ఉపాధ్యక్షులు ఎల్లేష్ కాలప్ప రామాజంనేయులు మృతికి సంతాపాన్ని తెలిపారు.

ముస్లింల హక్కులపై కేంద్ర ప్రభుత్వం దాడి

ఐకమత్యంతోనే రక్షణ సాధ్యం
ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్‌లా బోర్డు చైర్మన్

ప్రజాశక్తి-కర్నూల్ క్రైమ్

ముస్లింల ప్రత్యేక హక్కులపై కేంద్ర ప్రభుత్వం దాడి చేస్తుందని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చైర్మన్ హజరత్ ఖలీద్ సైపుల్లారహమాని అన్నారు. ఇలాంటి దాడుల నుంచి రక్షణ పొందేందుకు ముస్లింలు ఐకమత్యంతో మెలగాలన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని దామోదరం సంజీవయ్య స్మారక ఉన్నత పాఠశాల మైదానంలో ఆల్ జమాత్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ కర్నూలు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన మారు తున్న దేశ స్థితిగతులు మన బాధ్యత అంశంపై అవగాహన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ... దేశంలో అసహన పరిస్థితులు ముస్లిం సమాజంపై దాడులు పెరుగుతున్నాయని అన్నారు. మతాల పేరిట హింసను సృష్టించి రాజకీయ లబ్ధిని పొందాలన్నా దురుద్దేశం దీని వెనక ఉన్న అసలు రహస్యం అన్నారు.

రాజకీయ లబ్ధికోసం దేశంలో పాలకులు ఈ తరహా దుర్మార్గపు చర్యలకు కోరుకుంటున్నారని, ఇది దేశ సమైక్యతను దెబ్బ తీస్తూ విద్వేషాలను సృష్టిస్తుందన్నారు. అందుకు దేశంలో ఇది వరకే ఎన్ ఆర్ సి, హిజాబ్ ప్రస్తుతం సివిల్ కోడ్ వంటి అంశాలతో చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తోందన్నారు. భారతదేశం లౌకిక దేశమని పేర్కొన్నారు. ముస్లింలు అత్యంత వెనకబాటుకు గురయ్యారని ముఖ్యంగా విద్య, వైద్యం ఉద్యోగాలకు దూరమవు తున్నారన్నారు. నూతన విద్యా విధానం పేరుతో ముస్లిం పిల్లలను విద్యకు మరింత దూరం చేస్తుందని అన్నారు. ఈ వెనుకబాటు తనానికి పాలకులే కారణమన్నారు. విద్వేష రాజకీయాలను ఓడించడానికి ఓటును ఆయుధంగా మలుచు కోవాలన్నారు. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ ముస్లిం విద్యార్థులకు విద్యను అందించేందుకు కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమానికి ఉత్తరప్రదేశ్ నుండి హజరత్ యాసీన్ ఉస్మాని, బెంగళూరు నుంచి ముస్తఫా రిఫాయి, హైదరాబాద్ నుంచి బ్రదర్ సిరాజ్, బెంగళూరు నుంచి ఇమ్రాన్ మక్సుద్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో కర్నూల్ జమాతే నాయకులు జుబేర్ మౌలానా, జాకీర్ మౌలానా, హఫీస్ అబ్దుల్లా, అబ్దుల్ రెహమాన్, నూరుల్లా ఖాద్రి, క్వాజి తౌసిఫ్, హఫీస్ అబ్దుల్ ఖుద్దూస్ మన్సూర్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ముస్లింపర్సనల్ లాబోర్డు చైర్మన్ ఖలీద్ సైపుల్లా రహమాని

రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు వర్క్‌షాప్‌ను జయప్రదం చేయండి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్


ఈనెల 16, 17 తేదీల్లో కర్నూల్లో జరుగుతున్న రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ల వర్క్‌షాపును జయప్రదం చేయాలని ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజఫర్ అహ్మద్ రవాణా రంగ కార్మికులను కోరారు. ఆదివారం కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో ట్రాన్స్‌పోర్టు నిర్వహణ కమిటీ సమావేశం ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది. ముజఫర్ అహ్మద్, సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్. రాధాకృష్ణ మాట్లాడుతూ రవాణారంగం పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయన్నారు. రవాణా రంగాన్ని ఆదుకోకపోగా అనేక రకాలుగా వేధింపులకు ఈ ప్రభుత్వాలు గురి చేస్తున్నాయని వారన్నారు. ఈనెల 16, 17 తేదీల్లో జరుగుతున్న రాష్ట్ర ట్రాన్స్‌పోర్టు వర్క్ షాప్‌లో రవాణ రంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ కర్తవ్యాలు రూపొందిస్తామన్నారు. దానికి తగిన ఆందోళన కార్యక్రమాల రూపొందిస్తామన్నారు. 16న ట్రాన్స్‌పోర్టు కార్మికుల మహా ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఆటో యూనియన్ న్యూ సిటీ కార్యదర్శి బి.రాధాకృష్ణ, ఓల్డ్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు రవి, పి.మహమూద్. మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు రియాజ్ గంగాధర్. ఓల్డ్ సిటీ ఆటో యూనియన్ నాయకులు డి.కుమార్ ,వెంకటస్వామి పాల్గొన్నారు.

విశ్వసనీయతే మా వాహనాల ప్రత్యేకత

ఇసుజు మోటార్స్ ఇండియా డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ టోరు కిషిమోటో

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

విశ్వసనీయత, పనితీరు మా వాహనాల ప్రత్యేకతకు మారు పేరుగా నిలుస్తుందని ఇసుజు మోటార్స్ ఇండియా డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ టోరు కిషి మోటో పేర్కొన్నారు. ఇసుజు డి మాక్స్ ఎస్ క్యాబ్ జెడ్ నూతన వాహనం ఇండియా మార్కెట్ లోకి విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా టోరు కిషిమోటో మాట్లాడుతూ మా వాహనంలో డ్రైవర్, కో డ్రైవర్ ఇద్దరికీ రక్షణ కోసం ఎయిర్ బ్యాగులతో అత్యుత్తమ భద్రత, వాహన వినియోగదారుల కమ్యూనిటీకి మద్దతు ఇవ్వడానికే సౌకర్య వంతమైన అమ్మకాలు, సర్వీసు టచ్ పాయింట్లను అందించడానికి మా డీలర్ షిప్ నెట్వర్క్ ను కూడా దేశవ్యాప్తంగా పెంచుతున్నామని తెలిపారు. ఇది నిజంగా 'బియాండ్ ది ఆర్డినరీ' గా ఉండాలని వాహనం ఆకాంక్షను ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు.





కరాటే క్రీడాకారులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

క్రీడలతో క్రమశిక్షణ, ఆరోగ్యం : డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు స్పోర్ట్స్

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండి క్రమశిక్షణ గల పౌరులుగా ఎదగాలంటే కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయడం ఎంతో ఉపయోగపడుతుందని ప్రముఖ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర శర్మ సూచించారు. ప్రకాశం జిల్లా చీమకుర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించిన జిల్లా క్రీడాకారులను ఆయన అభినందించారు. కర్నూలు నగరంలోని పెద్ద మార్కెట్ మున్సిపల్ పాఠశాల మైదానంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ప్రతి చిన్న క్రీడాకారులకు ప్రశంసా పత్రాలతో పాటు గోల్డ్, సిల్వర్ మెడల్స్ ను బహూకరించారు. డాక్టర్ శంకర శర్మ మాట్లాడుతూ విద్యార్థులు కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయడం వల్ల శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడి చదువులోనూ రాణిస్తారని తెలిపారు. కరాటే సాధనలో యోగ, ప్రాణాయామం, బ్రీతింగ్ వంటి ఎక్సర్‌సైజులు మిళితమయి ఉన్నాయని, విద్యార్థుల సంపూర్ణ ఆరోగ్యానికి ఉపయోగపడతాయని చెప్పారు. ప్రపంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశం భారతదేశం అని, మన దేశంలో ఉన్నంత యువత ప్రపంచంలో ఏ దేశంలో లేరని చెప్పారు. ఏ దేశం సంపూర్ణంగా అభివృద్ధి చెందాలన్నా యువత కీలకపాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. అలాంటి యువత క్రమశిక్షణ గల పౌరులుగా ఎదగాలంటే కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్ ఉత్తమమైన సాధనమని చెప్పారు. రాష్ట్రస్థాయిలో మంచి ప్రతిభ చూపి కర్నూలు పేరు నిలబెట్టారని అన్నారు. కర్నూలు నగరంలో క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం నిరంతరం అందిస్తానని డాక్టర్ శంకర శర్మ స్పష్టం చేశారు. జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు , ప్రభుత్వ బాలికల పాఠశాల హెడ్మాస్టర్ మౌలాలి, మాస్టర్లు క్రాంతి పాల్గొన్నారు.

పలుకుదొడ్డిలో కోట్ల హర్ష సందడి

ప్రజాశక్తి- సి బెళగల్



మండలంలోని పలుకుదొడ్డిలో వైసిపి కార్యకర్తలు శేఖర్ రెడ్డి, మధుసుధన్ రెడ్డిలు కొత్త నివాసం ఏర్పాటు చేసుకున్నారు. కూడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి వారి నివాలసకు వచ్చి ఆదివారం అభిమానులతో సందడి చేశారు. ఎన్నికల వాతావరణం మొదలైందని, త్వరలో కోడుమూరు వైసిపి అభ్యర్థి ప్రకటన చేస్తామన్నారు. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు.



శిబిరంలో రోగులను పరీక్షించిన వైద్యులు

ఉచిత వైద్య శిబిరానికి అపూర్వ స్పందన

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలో అవోపా ఆధ్వర్యంలో, నంద్యాల శాంతిరామ్ హాస్పిటల్ సౌజన్యంతో చిన్న శక్తిగుడి ఏరియా జిహేశ్వర పాఠశాలలో జరిగిన ఉచిత గుండె, కంటి పరీక్ష శిబిరానికి భారీ స్పందన లభించింది. ఆదివారం ఉదయం శిబిరాన్ని ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు ఎన్ఆర్ఐ నాగేష్ కాకుబాళ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆవోపా అధ్యక్షులు వంకదారు శ్రీనాథ్ గుప్తా, మాజీ అధ్యక్షుడు శిబిర దాత నగేష్ కాకుబాళ్, కార్యదర్శి మిరియాల శ్రీధర్ మాట్లాడారు. గతంలో ఉచిత కంటి పరీక్ష శిబిరం సంతానం లేని వారికి వైద్య పరీక్షలు శిబిరము నిర్వహించామన్నారు. బాధితుల కోరిక మేరకు ఉచిత కంటి గుండె పరీక్ష శిబిరము నిర్వహించేందుకు పూనుకున్నామన్నారు. డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సురేష్ బృందంచే శిబిరంలో పరీక్ష నిర్వహించారు. అనంతరం డాక్టర్ల సలహా మేరకు ఉచిత కంటి ఆపరేషన్లు, 5 మందికి గుండె ఆపరేషన్లను నంద్యాల శాంతిరాం హాస్పిటల్‌లో ఉచిత ప్రయాణ సౌకర్యంతో నిర్వహించనున్నట్లు తెలిపారు. అవోపా ఉపాధ్యక్షులు ప్రతాప్, ఈరన్న శెట్టి, సభ్యులు రంగ, రాఘవేంద్ర, రఘు మహిళా విభాగ్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారు మమతశ్రీ, సంగీత, బిందు, గీత పాల్గొన్నారు.



రౌండ్ టేబుల్ సమావేశానికి ఉద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం జిల్లా నాయకులు గోవింద్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపాలి : సిపిఎం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

నిరుద్యోగులంతా ఐకమత్యమై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దింపాలని సిపిఎం జిల్లా నాయకులు గోవిందు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని స్థానిక ఎన్జీవో ఆఫీసు నందు నిరుద్యోగ సమస్యల పరిష్కారానికై సిపిఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విజయ్ అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా నాయకులు గోవింద్, డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంగప్ప మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో అధికారంలోకొస్తే ప్రతి సంవత్సరం 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్నారు. కేంద్రంలోని ప్రభుత్వ శాఖల్లో 9.82 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని అన్నారు. 2019 ఎన్నికల ముందు జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వస్తే 2 లక్షల 36 వేల ఉద్యోగాలను భర్తీ చేస్తానని, ప్రతి సంవత్సరము జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి భర్తీ చేస్తానని చెప్పి ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని పేర్కొన్నారు. వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే ప్రభుత్వాలను గద్దె దింపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో సిఐ టియు పట్టణ కార్యదర్శి రాముడు, డివైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ నాయకులు రవి రంగనాథ్, సుషిరాజు, అబ్రహం, మార్క్, మహబూబ్, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాలకు ఫ్యాన్లు విరాళం

ప్రజాశక్తి-ఆలూరు



ఫ్యాన్లు అందజేస్తున్న దృశ్యం

వసతి గృహాలలో ఉంటూ విద్యానభ్యసిస్తున్న పేద విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణ కొరకు ఫ్యాన్లు విరాళంగా అందజేసినట్లు టిడిపి నాయకురాలు, వ్యాపారవేత్త వైకుంఠం జ్యోతి తెలిపారు. ఆదివారం ఆలూరులోని ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహంలో విద్యార్థుల వినతి మేరకు వార్డెన్ మహమ్మద్ అలీకి ఫ్యాన్లు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్య అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యార్థుల ఇబ్బందులను గుర్తించి అడిగిన వెంటనే ఫ్యాన్లు ఇచ్చినందుకు వార్డెన్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

'తుంగ'లో తోడేస్తున్నారు..

- ఎమ్మెల్యే చెప్పారంటూ రాత్రి పూట అక్రమ ఇసుక రవాణా.. - నది తీరం వెంట రోజుకు వందకు పైగా ఇసుక ట్రాక్టర్లు తరలింపు
- రెవెన్యూ, పోలీసుల తీరుపై ప్రజలు అసంతృప్తి - వైసిపి నాయకుల కనుసన్నల్లోనే ఇసుక మాఫియా..?

ప్రజాశక్తి - నందవరం

వైసిపి నాయకులు అధికారం ఉంది కదా అని ఇష్టానుసారంగా పెద్దాయన ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి పేరు చెప్పి తుంగభద్ర నది లోని ఇసుకను అక్రమ రవాణా చేస్తూ లక్షల్లో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ నాయకులు మాత్రం లక్షలు జేబుల్లో వేసుకుంటున్నారని ప్రజల్లో పెద్దఎత్తున్న చర్చ జరుగుతోంది. నందవరం మండలం పరిధిలోని నదికైరవాడి, గంగవరం, పెద్ద కొత్తిలి, చిన్న కోతిలి, నాగలదిన్నె, గురజాల, రాయచోటి గ్రామాల్లో అనధికార ఇసుక రిచ్‌లను ఏర్పాటు చేసి, జెసిబితో రాత్రి పూట ఇసుకను తోడేస్తున్నారు. తుంగభద్ర నదిలో నుండి ఒక్కో ట్రిప్ ఇసుకను తరలించాలంటే దూరాన్ని బట్టి రూ. 6వేల నుండి రూ. 8వేల వరకు అమ్ముతున్నారు. కొంతమంది అధికార పార్టీ నాయకుల అధికారం అండతో ఇసుక మాఫియాగా మారి, రాత్రుల్లో ఇసుకను తోడేసి ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండికొడుతూ, వారి జేబులు నిప్పుకుంటున్నారు. ఇసుక తరలింపును కింది



సీజ్ చేసిన ట్రాక్టర్లు

స్థాయి అధికారులు అడ్డుకుంటే మాకు పెద్దా యన ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి చెప్పరని, నువ్వు మమల్ని అడిగే అంత పెద్ద వాడివా అని, మీ తహసీల్దార్, ఎస్ఐలే మమల్ని ఏమి అనలేక పోతు న్నారని, నువ్వెంత అంటూ అధికార జులుం ప్రదర్శిస్తున్నారు. అధికారులకు రాజకీయ వత్తిడిలు రావడంతో ఏమి చేయలేని స్థితిలో ఉండి పోతున్నారు. దీన్ని ఆదునుగా తీసుకున్న కొంతమంది అధికార పార్టీ నాయకులు ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ట్రాక్టర్ ఓనర్లతో కుమ్మక్కై రాత్రి పూట 10 నుండి 20ట్రాక్టర్లను ఏర్పాటు చేసుకొని ఇసుక మాఫియాను నడుపుతు న్నారు. అధికార పార్టీ నాయకులు మాత్రం ప్రభుత్వం పనులకు ఇసుకను తరలిస్తున్నామని చెపుతున్నారు. అయితే ప్రభుత్వం పనులకు ఇసుక కావాలంటే ఇసుక రిచ్ నుండే తరలించాలి. కానీ ఆలా కాకుండా రాత్రి పూట అనుమతి లేని గ్రామాల నుండి ఇసుకను తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇలా అయినా ఇసుక అందరికి దొరుకుంతుందా అంటే అదిలేదు. కేవలం అధికార పార్టీ నాయకులు మనుషులకు, రాజకీయ పలుకుబడి ఉన్న నాయకులకు మాత్రమే ఇసుక అందుబాటులో ఉందని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైన జిల్లా పోలీస్, విజిలెన్స్ అధికారులు స్పందించి అక్రమ ఇసుక తరలింపును అడ్డుకొని సామా న్యులకు ఇసుకను అందుబాటులోకి తీసుకోని రావాలని ప్రజలు కోరుతున్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం

- సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సబ్ కలెక్టర్, తదితరులు

చదువుతోపాటు విద్యార్థులకు క్రీడలు ఎంత అవసరమని ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, వైఎస్ఆర్సిపి యువ నాయకులు మనోజ్ రెడ్డి అన్నారు. ఆదివారం మల్లికార్జున విద్యాలయాలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండోర్ గేమ్స్‌కు ముఖ్య అతిథులుగా ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ సతీమణి సౌత్ ఇండియన్ రైల్వే గుంతకల్ ఏపీవో క్యాప్రిల్ అరోరా, వైఎస్ఆర్సిపి యువ నాయకుడు మనోజ్ రెడ్డి హాజరయ్యారు. ఇండోర్ గేమ్స్‌లో క్విజ్ పోటీలకు 54 మంది, ఎలుకేషన్ 60 మంది, రూబిక్యూబ్స్ 54 మంది, చెస్ 200 మంది, డ్రాయింగ్ 125 మంది విద్యార్థిని విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు రోటరీ క్లబ్ సర్టిఫికెట్‌తో పాటు మెడల్స్ కప్పులు అందజేశారు. ముందుగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఉమేష్ పాయి, కార్యదర్శి నితీష్ గాంధీ, అసిస్టెంట్ గవర్నర్ భరత్ ష ఆధ్వర్యంలో జరిగిన క్రీడలను ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా స్పూర్తిని వెలికి తీసేందుకు రోటరీ క్లబ్ వారు నిర్వహిస్తున్న ఔట్డోర్, ఇండోర్ ఆటల పోటీలకు వేలాది మంది విద్యార్థిని విద్యార్థులు పోటీలకు హాజరవుతున్నడం సంతోషించదగ్గ విషయం అన్నారు. చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు పొందాలంటే ఏవైనా క్రీడల్లో రాణించారని అడుగుతు న్నారని, కావున క్రీడలు జీవితంలో ఒక భాగం కావాల న్నారు. క్రీడలు ఆడడం వల్ల మానసికంగా ధృఢంతో పాటు ఉల్లాసంగా ఉంటామని అన్నారు. ఎలాంటి ఎంట్రీ రుసుము లేకుండా రోటరీ క్లబ్ వారు నిర్వహించే క్రీడల పోటీలకు వస్తున్న స్పందన ఎనలేనిదని, ఇలాంటి కార్యక్రమాలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్సన్ సైన్స్ కళాశాల కరస్పాండెంట్ దైవ దానం, రోటరీ క్లబ్ సభ్యులు సునీల్ రెడ్డి జీవన్ సింగ్, సోమశేఖర్ రెడ్డి, ప్రశాంత్ గాంధీ, ఇతేశ్, నితేష్ గాంధీ, రాయచోటి సుబ్బయ్య, పద్మనాభయ్య శెట్టి, శేషయ్య, సందీప్ రెడ్డి, డాక్టర్ సైపుల్లా, సాబిర్ అహ్మద్, విట్టా రాజేష్, శివరాం, హుస్సేన్ బాషా, విజయ్ చౌదరి, రఘునాథ్ రెడ్డి, వికాస్ బండారి తదితరులు పాల్గొన్నారు.



మృతిచెందిన మేక

గొర్రెల మందపై చిరుత దాడి

- మేక మృతి

ప్రజాశక్తి -పెద్దకడబూరు

మండలంలోని పీకలబెట్ట గ్రామ శివారుల్లోని నక్కల ఈరన్న గొర్రెల మందపై చిరుత శనివారం అర్ధరాత్రి దాడి చేసి ఒక గొర్రె, ఒక మేకను పొట్టనబెట్టుకుంది. మేకను కొండలోకి లాక్కొని చంపేసింది. ఆదివారం ఉదయం గ్రామస్థులు చిరుత ఆనవాలు గుర్తించి కొండలోకి వెళ్లి చూడగా మేక చనిపోయి ఉండడాన్ని గమనించి కిందికి తెచ్చారు. చిరుత సంచా రంతో పీకలబెట్ట గ్రామస్థులు భయాందోళలకు గురవుతున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి చిరుతను గుర్తించడంతోపాటు బంధించి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఏదైనా ప్రమాదం జరిగితే అటవీ శాఖ అధి కారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు.

సీతారామిరెడ్డికి అభినందనలు వెల్లువ

ప్రజాశక్తి - మంత్రాలయం

తిరుమల తిరుపతి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా ఎన్నికైన వై సీతారామిరెడ్డికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఆదివారం స్థానిక గ్రామ ఉపసర్పంచ్ హెూటల్ పరమేష్ స్వామి ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయం లో ఎమ్మిగనూర్ ఆర్టీసీ డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు వై సీతారామిరెడ్డి ఇటీవల టిటిడి పాలకమండలి సభ్యులుగా ఎన్నికయిన నేపథ్యంలో ఆయనను కలిసి శాలువలతో పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామలింగయ్య స్వామి, కర్నూలు బసవరాజు స్వామి, వెంకటాపురం బసవరాజు స్వామి, వినీత్, అడ్వకేట్ వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



టిటిడి బోర్డు సీతారాం సీతారాం రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఉరుకుందలో పెరిగిన భక్తుల సందడి

- స్వామి వారి సన్నిధిలో ప్రముఖులు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రావణమాస ఉత్సవాలలో భాగంగా శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పుణ్యక్షేత్రం భక్తుల సందడి నెలకొంది. మూడవ సోమవారానికి ఆదివారం రోజు నుండి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. పుణ్యక్షేత్రం పరిసరాలు అంత భక్తులతో కళకళలాడింది. సోమవారానికి సుమారు మూడు నుండి నాలుగు లక్షల మంది భక్తులు రావచ్చని అంచ నాతో పాలకమండలి అధ్యక్షులు నాగరాజు గౌడ్, దేవాలయ సహాయ కమిషనర్ వాణి, సూపర్డెంట్ రామ్మోహన్ వెంకటేష్ మల్లికార్జున తమ సిబ్బందితో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను పర్యవేక్షి స్తున్నారు. డిఎస్‌పి సీతారామయ్య, సీఐ ఎరిషావలి, ఎస్సై నరేంద్ర కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా కౌతాళం ఆదోని కోసిగి హల్వి రహదారుల వైపు నుండి వచ్చే భారీ వాహనాలను పార్కింగ్ స్థలాల్లో నిలిచిన చర్యలు చేపట్టారు. భక్తులకు ఇలాంటి ఇబ్బందులు కలగకుండా పుణ్యక్షేత్ర పరిసరాలలో ఉండేందుకు అన్ని ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. ముఖ్యంగా దొంగతనాలు జరగకుండా భక్తుల వద్ద ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు.

ఈరన్న సన్నిధిలో ప్రముఖులు

శ్రీ నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి సన్నిధిలో ఆదివారం ప్రముఖుల పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ బుట్ట రేణుక, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు వై సీతారాం రెడ్డి స్వామివారిని విడివిడిగా దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న వారికి దేవాలయ అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శాలువాతో పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ నాగరాజు గౌడ్, దేవాలయ అధికారులు పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.



ఉరుకుందలో టిటిడి బోర్డు సీతారాం సీతారాం రెడ్డి



స్వామివారిని దర్శించుకొని వస్తున్న మాజీ ఎంపీ బుట్టా రేణుక, తదితరులు

సాగు నీటిపై ఆశలు పెట్టుకోవద్దు

- ఎబిసి డిఈ మంజునాథ్

ప్రజాశక్తి - చిప్పగిరి



సాగునీరు ఈ సంవత్సరంలో చివరిదాకా వస్తాయని ఆశలు పెట్టుకో వద్దని కొత్తగా పంటలను రైతులు సాగు చేయవద్దని ఆలూరు బ్రాంచ్ కాలువ డిఈ మంజునాథ్ ఆయకట్టు రైతులకు సూచించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం డ్యాంలో రోజురోజుకు నీటి మట్టం తగ్గుముఖం పడుతుందన్నారు. కానీ రైతులు ఇటీవల హంద్రీనీవా కాలువకు నీటిని విడుదల చేసిన నేపథ్యంలో అనేకమంది రైతులు కొత్తగా పంటలను సాగు చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. వర్షాలు వస్తే సాగు చేసుకోవచ్చని, కానీ రాలేని పక్షంలో రైతులు అధిక పెట్టుబడులు పెట్టి తీవ్రంగా నష్టపోయే పరిస్థితిని తెచ్చుకోవద్దని రైతులకు సూచించారు. ఏబిసి కాలువ పరిధిలో ఆయకట్ట రైతులు ఈ విషయాన్ని గమనంలో ఉంచుకొని ఎవ్వరు విత్తన సాగు చేయవద్దని రైతులకు తెలుపుతున్నా మన్నారు. ఇప్పుడు ప్రవహిస్తున్న హంద్రీనీవా కాలువకు అక్రమ మోటర్లు తొలగించే ప్రక్రియ నిర్విరామంగా జరుగుతోందన్నారు. ఈ కార్యాక్రమంలో ఏఈ తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పంచమాంకాల నాటకం



ప్రజాశక్తి - మంత్రాలయం

మండల కేంద్రమైన మంత్రాలయంలో పంచమాంకాల పౌరాణిక నాటకం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. శనివారం రాఘవేంద్ర స్వామి సప్త రాత్రోత్సవాలలో భాగంగా ఉత్తరారాధనలను పురస్కరించుకుని హార్మోనిస్టులు రాఘవేంద్ర, పద్మనాభాచారి ఆధ్వర్యంలో రాత్రి పది గంటల కు నాట ప్రదర్శనలు నిర్వహించారు. శ్రీకృష్ణుడు పడకసీను, వారనాసి, సుభద్రా అర్జులు, కృష్ణార్జున యుద్ధం, చింతామణి వంటి నాటకాలతో అలరించారు. పడకసీను ఘట్టంలో శ్రీకృష్ణుడుగా అర్జునుడుగా తెర్నెకల్లు రఘు, ధుర్యోధన పాత్రలో వట్టేప్ప గారి చిన్న సుంకప్ప నటించగా, సత్యహరిశ్చంద్రలో హరిశ్చంద్రుడు వడ్డే నారాయణ, చంద్రమతిగా రత్న శ్రీ, నక్షత్రేశ్వరుడుగా సి. రవి, కాలకౌసికుడుగా పోష్టు రాఘవులు, వీరభా హుడుగా వట్టేప్ప గారి చిన్న సుంకప్ప నటించి మైమరపించారు. సత్య హరిశ్చంద్రుడు ఇచ్చిన మాట ప్రకారం రుణం తీర్చేందుకు తన భార్య అయిన చంద్రమతిని అమ్మే ప్రయత్నంలో ఆలపించిన పద్యాలు వీనులవిం దు చేసి చూపరులను కంటతడి పెంట్టించాయి. అన్నదమ్ములు, ఆలుబిడ్డలు, కన్న తల్లిదండ్రులు బంధువులు స్నేహితులు వెంట రారు తుదికిన్ అనే పద్యాన్ని ఒన్స్ మోర్ అంటూ ప్రేక్షకుల కోరికతో వడ్డే నారాయణ ఆలపించగా కరతాళ ధ్వనులు మ్రోగాయి. సినిమాలు యూటూబ్ లు ఉన్న ఈ కాలంలో నాటక కళారంగం మరుగున పడకుండా శ్రీ రాఘవేంద్ర నాటక కళా సమితికి మేమున్నామంటూ వెన్నంటి ఉండి నడిపించే శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదే ంద్రతీర్థులు రూ.50 వేలు, ఎమ్మెల్యే వై బాలనాగిరెడ్డి రాంపురం రెడ్డి సోదరుల తరుపున రూ.20 వేలు, టిడిపి నియోజకవర్గ ఇంచార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి రూ.15 వేలు, టిడిపి మండల అధ్యక్షులు పన్నగ స్వామి 5 వేల రూపాయలు విరాళంగా ఇచ్చి ప్రోత్సహించడం పట్ల శ్రీ రాఘవేంద్ర నాటక కళా సమితి సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నాటక ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా హాజరయిన వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, గ్రామ సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, ఉపసర్పంచ్ హెూటల్ పరమేష్, నాయకులు జనార్దన్ రెడ్డి, వెంకటరెడ్డిలను నాటక కళారంగం నుంచి శాలువతో పూలమాలలు వేసి సన్మానించారు.

నాణ్యతతో ఎస్ఎస్ ట్యాంకు పనులు చేపట్టాలి : సిపిఐ

ప్రజాశక్తి - ఆదోని

గతంలో మాదిరి కాకుండా ప్రస్తుతం బసాపురం ఎస్ఎస్ ట్యాంకు కట్ట పనులు చేపట్టాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అజయ్ బాబు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ బృందం ప్రతినిధులు ఆదోని రాంజల చెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆజయ్ బాబు మాట్లాడుతూ తాగేందుకు యోగ్యంగా లేదని నిపుణుల సలహా మేరకు రాంజలలోని నీటిని బయటికి తోడేస్తున్నా శనివారం కురిసిన వర్షానికి అధిక నీరు రావడంతో సమస్య మళ్లీ మొదటికొచ్చింన్నారు. రాంజల చుట్టూ ప్రదేశాన్ని పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దటాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాంజల వద్ద చేపడుతున్న క్లీనింగ్ పనుల్లో ప్రజాధనం వృధా కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. బసాపురం ఎస్–ఎస్ ట్యాంక్ నిర్మాణ పనులు నాణ్యత లోపం వల్ల శిథిలావస్థకు చేరుకుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ, మండల కార్యదర్శులు సుదర్శన్, కలుబావి రాజు, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి ఎంకన్న, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యులు హర్షద్, షేక్షావలి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ నాయకులు



దేవరగట్టులో శ్రావణ మాస పూజలు

ప్రజాశక్తి- హోళగుంద

దేవరగట్టు మాలమల్లేశ్వర సామి వారికి శ్రావణమాస పూజలు నిర్వహించారు. ఆదివారం రాష్ట్రం నుండే కాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ మాల మల్లేశ్వర లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు దేవరగట్టు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. దేవరగట్టు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా హెూలగుంద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైఎస్ఆర్ పెన్షన్ కానుక వరం



పింఛన్ ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -పెద్దకడబూరు

వైఎస్ఆర్ పెన్షన్ కానుక వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు గొప్ప వరంలాంటిదని వైసీపీ నాయకులు హనుమప్ప, వెంకటేష్, అంజినయ్య, నాగరాజు స్పష్టం చేశారు. ఆదివారం పెద్దకడబూరు మండలంలోని నౌలేకల్ గ్రామంలో మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, గ్రామ సర్పంచ్ పల్లవి నరేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు కొత్తగా మంజూరైన సామాజిక పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ప్రతి నెల ఒకటో తారీఖునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లు అందించే ఘనత ఏపీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. అవ్వతాతలకు మనుమడుగా, వితంతువులకు సోదరుడుగా, వికలాంగులకు అన్నయ్యగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తోడు నీడగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వాలెంటీర్ ఉసేన్ బాషా పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలోని నిజాముద్దీన్ మైనార్టీ కాలనీలో మజీద్ హి హజరత్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కతం–ఈ–నుబువత్ క్విజ్ పోటీలు నిర్వహి ంచినట్లు మార్కెట్ యార్డ్ చైర్మన్ మజర్ అహ్మద్, మనియర్ ఇలియాస్ సాబ్ ఆదివారం విలేకరులకు తెలిపారు. ఆధ్యాత్మిక అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహించడం వల్ల విద్యార్థుల్లో సత్ప్రవర్తన అలవడుతుందన్నారు. ముఖ్య అతిథులుగా హాజరైన వారి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు ఆధ్యాత్మికతను అలవాటు చేయాలన్నారు.



ఉత్తమ రైతుగా మాజీ ఎంపిటిసి యల్లప్ప



అవార్డును అందుకుంటున్న యల్లప్ప

ప్రజాశక్తి -పెద్దకడబూరు

మండల పరిధిలోని చిన్నతుంబలం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ కేపీ యల్లప్పను ఉత్తమ రైతుగా ఐకార్ నార్మ్ సంస్థ ఎంపిక చేసింది. ఇందుకు సంబంధించిన అవార్డును యల్లప్పకు నార్మ్ సంస్థ 48వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాదులో జరిగిన సమావేశంలో యల్లప్పకు కండువా, జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ప్రకృతి వ్యవసాయం, మిశ్రమ వ్యవసాయంలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు యల్లప్పకు జాతీయ స్థాయిలో ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత యల్లప్ప ఆదివారం మాట్లా డుతూ నార్మ్ సంస్థ ద్వారా ఉత్తమ రైతుగా అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందని స్పష్టం చేశారు. అందులోను నార్మ్ సంస్థ డైరెక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు ఐసీఏఆర్ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ జెసీ కాత్యాల్ చేతుల మీదుగా అందుకోవడం గర్వంగా ఉందన్నారు. మిశ్రమ పంటలు వేయడం వలన రైతులు మంచి లాభాలు పొందవచ్చని, పురుగు మందులు లేని వ్యవసాయం దిశగా రైతులు అడుగులు వేయాలని హితవు పలికారు. తనకు అవార్డు రావడానికి సహకరించిన ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి, వైసీపీ యువజన విభాగం రాష్ట్ర నాయకులు ప్రదీప్ రెడ్డి, పెద్దకడుబురు వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పురుషోత్తం రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్ రామ్మోహనరెడ్డి, రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి వరప్రసాద్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



సీతారామిరెడ్డితో యల్లప్ప

జమిలి ఎన్నికలు అనాలోచితం


- మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జీ.మహానంది

ప్రజాశక్తి-ఆస్పరి

కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలు కోసం తాపత్రాయ పడడం అనాలోచిత నిర్ణయమని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జి.మహానంది అన్నారు. ఆదివారం మండల పరిధిలోని జోహారాపురం గ్రామంలో మాల మహానాడు ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికార బిజెపి ప్రభుత్వం ఎంతో కాలంగ తెరపైకి తెస్తున్న జమిలి ఎన్నికల ప్రతిపాదన దేశా అభివృద్ధికి శూన్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంజీవ, జనార్ధన్, నాగార్జున, అనిల్, వీర కుమార్, గోవిందు, నరేష్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు జీ.మహానంది



ఆళ్లగడ్డలో భారీ వర్షం


వర్షం కురవడంతో కుందు నదిలో నీటి ప్రవాహం

- నియోజకవర్గంలో నదులకు జలకళ
- అహోబిలంలో కనువిందు చేస్తున్న జలపాతాలు
- చాగలమర్రి మండలంలో ఉప్పొంగిన వాగులు, వంకలు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ నియోజకవర్గంలో ఆదివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి వక్కిలేరు, భవనాసి, కుందునదిలోకి నీరు వచ్చి చేరింది. కాచింతలలోని వక్కిలేరు వద్ద భారీగా నీరు వచ్చి చేరింది. ఆళ్లగడ్డలో సుమారు 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది.. ఉయ్యాలవాడలో 10 సెంటీమీటర్లు, దొర్నిపాడు మండలంలో 79.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఉయ్యాలవాడ మండలంలోని గోవిందపల్లి చెరువు నుంచి వర్షం నీరు రోడ్డెక్కి ప్రవహిస్తూ ఉండడంతో కోవెలకుంట్ల జమ్మలమడుగు మధ్య రాకపోకలు స్తంభించాయి. వర్షాభావ పరిస్థితులలో నదులలో గత కొద్ది రోజులుగా నీరు లేకపోవడంతో పరివాహక గ్రామాల్లోని రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షంతో రైతన్నలు, ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అహోబిలంలో కనువిందు చేస్తున్న జలపాతాలు : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఎగువ అహోబిలంలో కురిసిన భారీ వర్షానికి జలపాతాలు కనువిందు చేస్తున్నాయి. నల్లమల కొండలపై నుంచి భవనాసి జలపాత సోయగం పర్యాటకులను ఎంతో ఆకట్టుకుంటుంది. అలాగే ప్రహ్లాద బడి జ్వాలా నరసింహస్వామి ఆలయం వద్ద ఎత్తైన కొండల నుంచి దూకుతున్న జలధారలు ప్రకృతి ప్రియులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. **చాగలమర్రి :** చాగలమర్రి మండలంలో గత రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం పడింది. సుమారు 10 సె.మీ వర్షపాతం నమోదయ్యింది. ఈ భారీ వర్షానికి వక్కిలేరు, అడ్డవాగు వంకలు ఉధృతంగా రహదారిపై ప్రవహించాయి. మండలంలోని కలుగొట్లపల్లె, బ్రహ్మణ పల్లె గ్రామ సమీపంలోని వాక్కిలేరు రహదారిపై ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే అహెూబిలం వెళ్లే రహదారిలో గల అడ్డవాగు వంక కూడా రహదారిపై పొంగి ప్రవహించడంతో రాకపోకలు స్థంభించి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాగే మండలం లోని పలు గ్రామాల్లో కాలనీలు జలమయం కావడంతో పాటు, పంట పొలాలు నీట మునిగాయి. **పగిడ్యాల :** పగిడ్యాల మండలంలో ఆదివారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. వర్షాలు కురవడంతో రైతులు పొగాకు నాట్లు వేస్తున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో మొక్కజొన్న, మినుములు సాగు చేసిన పంటల రైతులు మాత్రం ఈ వర్షం నెల రోజుల కిందట పడి ఉంటే మొక్కజొన్న, మినుములు సాగు దిగుబడి బాగా వచ్చేదని పేర్కొంటున్నారు. మొక్కజొన్న, మినుము పంటలు ఎండిపోయాయని, ఈ వర్షం వలన ఎటువంటి లాభం లేదని చెబుతున్నారు. పగిడ్యాల మండలంలో 42.6 సె.మీ వర్షపాతం నమోదయినట్లు తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది తెలిపారు. **బేతంచెర్ల :** సుమారు రెండు నెలలకు పైగా వర్షం లేక పంటలు ఎండిపోతున్న తరుణంలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు వర్షం పడడంతో ఎట్టకేలకు ఊపిరి పోసినట్టు అయింది. బేతంచెర్ల పట్టణంతోపాటు ఆయా గ్రామాల్లో కూడా ఒక మోస్తారు వర్షం పడటంతో కంది, కొర్ర, సజ్జ, మొక్కజొన్న తదితర పంటలకు కొంత ఉపయోగకరంగా మారిందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


అహోబిలంలో జలపాతం


కలుగొట్లపల్లె వద్ద రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తున్న వక్కిలేరు


నీట మునిగిన మల్లె తోట

ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

- ఈ ఏడాది నుండి విజువల్ క్లీనింగ్ కార్యక్రమాలు
- ఉపాధి నిధులతో సిసి రోడ్లు, డ్రైయినేజీ కాల్వల నిర్మాణాలు
- పంచాయతీలలో నగదు రహిత లావాదేవీలు
- జిల్లా పంచాయతీ అధికారిణి మంజులా వాణి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్



'స్వచ్ఛ సర్వేక్షణ్ మిషన్-2023 కార్యక్రమం ద్వారా ఈ ఏడాది నుండి గ్రామాల్లో విజువల్ క్లీనింగ్ కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీని ఏడాదిలోగా ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనులు జరుగుతున్నాయి. ఈ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు, సురక్షిత మంచినీటిని ప్రజలకు అందించడం, బహిరంగ మల విసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడం, 'సంపూర్ణ స్వచ్ఛత వైపు అడుగు వేద్దాం-మన గ్రామాన్ని ఒడిఎఫ్‌గా మార్చుకుందాం' అనే నినాదంతో ముందుకు సాగుతున్నాం' అని నంద్యాల జిల్లా పంచాయతీ అధికారి మంజులా వాణి తెలిపారు. జిల్లాలోని గ్రామ పంచాయతీల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై ఆమె ప్రజాశక్తితో ముఖాముఖి మాట్లాడారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2023 కింద గ్రామాల్లో ఏఏ కార్యక్రమాలు జరుగుతున్నాయి..?

డిపిఒ : గ్రామాల్లో ఘన వ్యర్థాల నిర్వహణ, మురుగునీటి నిర్వహణ, మల వ్యర్థాల నిర్వహణ, పారిశుధ్యంపై అవగాహన, పరిశుభ్రంగా ఉందా లేదా అని చూడటం వంటి కార్యక్రమాలు జరుగుతున్నాయి.

జిల్లాలో ఎన్ని గ్రామ పంచాయతీలు ఉన్నాయి..?

డిపిఒ : జిల్లాలో 489 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. అందులో 1477 మంది స్వచ్ఛ భారత్ కార్మికులు పని చేస్తున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ కింద వీరిని నియమించుకొని పారిశుధ్య పనులు చేయిస్తున్నాం. అలాగే గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి పొడి, తడి చెత్తను సేకరిస్తారు.

గ్రామాల్లో ఇంటింటి నుంచి సేకరించిన తడి చెత్తను ఏమి చేస్తారు...?

డిపిఒ : గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లిసేకరించిన తడి చెత్త, పొడి చెత్తను షెడ్లలోకి తరలిస్తారు. అక్కడ తడి, పొడి చెత్తను వేరు చేస్తారు. తడి చెత్త ద్వారా వర్మీ కంపోస్ట్ ఎరువులు తయారు చేస్తారు.

జిల్లాలో వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీకి ఎన్ని షెడ్లు ఉన్నాయి..?

డిపిఒ : జిల్లాలో కంపోస్ట్ ఎరువుల తయారీకి 335 షెడ్లు నిర్మాణాలు పూర్తి చేశాము.

గ్రామ పంచాయతీలలో నగదు రహిత చెల్లింపులు ఎప్పటి నుండి అమలులోకి వస్తున్నాయి..?

డిపిఒ : ఈ నెల 15 నుండే గ్రామ పంచాయతీలలో నగదు రహిత చెల్లింపులు అమలులోకి వచ్చాయి. క్యూఆర్ కోడ్ ద్వారా గానీ, ఈ పాస్ మిషన్, గూగుల్ పే, ఫోన్ పే, నెట్ బ్యాంక్ ద్వారా చెల్లింపులు జరుగుతాయి. ఈ పద్ధతి ద్వారా నిధులు ఖర్చుల వ్యవహారాల్లోను, చెల్లింపుల విషయంలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా పాలన జరుగుతుంది.

గ్రామ పంచాయతీల్లో సురక్షిత నీరు అందించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డిపిఒ : గ్రామీణ ప్రాంత ప్రజలకు గ్రామీణ సురక్షిత మంచినీటి పథకం ద్వారా సురక్షిత మంచినీటిని అందించడానికి ఓహెచ్ఎస్ఆర్, జిఎస్ఆర్ ట్యాంకులను క్రమం తప్పకుండా కార్మికులతో శుభ్రం చేయిస్తాం. ట్యాంక్‌లను క్లోరినేషన్ చేయిస్తున్నాం. అలాగే పంచాయితీ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షణ చేస్తుంటారు.

గ్రామ పంచాయతీలకు నిధులు వస్తున్నాయా..?

డిపిఒ : గ్రామ పంచాయతీలలో ఉన్న కరెంట్ బిల్లులను ప్రభుత్వమే నేరుగా కడుతుంది. ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కొక్క మండలానికి రూ.60 లక్షలు నిధులను ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఇచ్చింది. ఈ నిధులతో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులు చేయిస్తున్నాం.

స్వచ్ఛ భారత్ కార్మికులకు 8 నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు..! అనేక చోట్ల స్వచ్ఛ భారత్ కార్మికులు ఆందోళన చేస్తున్నారు. దీనిపై మీ స్పందన..?

డిపిఒ : జీతాలు ఇవ్వడం లేదనేది మా దృష్టికి వచ్చింది. నిధుల లభ్యత ఉన్న చోట కార్మికులకు ఇబ్బంది లేకుండా జీతాలు ఇవ్వాలని చెప్పాం.. కొన్ని చోట్ల 15వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా జీతాలు ఇస్తున్నాం. పిఎఫ్ఎంఎస్ ద్వారా ఆన్లైన్ పేమెంట్స్ జరుగుతున్నాయి.

గ్రామాల అభివృద్ధికి ఎలాంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నారు..! దృష్టి సారించాల్సిన అంశాలు ఏమైనా ఉన్నాయా..?

డిపిఒ : గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది. చూడదగ్గ గ్రామాలుగా చేసేందుకు పలు అంశాలపైన దృష్టి సారించాం. 'సంపూర్ణ స్వచ్ఛత వైపు అడుగు వేద్దాం- మన గ్రామాన్ని ఓడిఎఫ్‌గా మార్చుకుందాం' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నాం. అన్ని గ్రామ పంచాయతీలు తప్పని సరిగా పోటీల్లో పాల్గొని అవార్డు గుర్తింపును పొందాలని గ్రామ



మూఢనమ్మకాలను విడనాడాలి

- జెవివి జిల్లా మహాసభలో డోన్ సివిల్ జడ్జి ఎస్.తంగమణి సూచన


జెవివి జిల్లా మహాసభలో మాట్లాడుతున్న డోన్ సివిల్ జడ్జి జస్టిస్ ఎస్.తంగమణి

ప్రజాశక్తి-డోన్

ప్రజలు మూఢనమ్మకాలను విడనాడాలని డోన్ సివిల్ జడ్జి జస్టిస్ ఎస్.తంగమణి సూచించారు. జనవిజ్ఞాన వేదిక నంద్యాల జిల్లా మహాసభలు ఆదివారం డోన్ పట్టణంలోని శ్రీ సుధ విద్యాలయంలో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగరాజు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన డోన్ సివిల్ జడ్జి ఎస్.తంగమణి మహాసభ ప్రారంభ సూచికగా జెవివి జెండాను ఎగురవేశారు. ప్రారంభ సభలో జస్టిస్ ఎస్.తంగమణి మాట్లాడుతూ ప్రజలందరూ శాస్త్రీయ అవగాహన పెంచుకోవాలన్నారు. ముందుగా విద్యార్థుల్లో శాస్త్రీయతపై విస్తృత అవగాహన పెంచాలన్నారు. మూఢ నమ్మకాలను, మూఢ విశ్వాసాలను విడనాడినప్పుడే సమాజం బాగుంటుందని అన్నారు. జెవివి లాంటి సంస్థలు విస్తరించి ప్రజలను చైతన్య పరచాలని అన్నారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అన్వర్ బాష, రామనరసప్ప మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రశ్నించేతత్వాన్ని పెంచుకోవాలని, ప్రశ్నతోనే ముడిపడి ఉందని అన్నారు. విద్యార్థులు శాస్త్రీయ పరిశోధనలు చేయాలన్నారు. ఈరోజు చంద్రయాన్3 విజయంతో ప్రపంచమంతా భారత దేశం వైపు చూస్తోందని అన్నారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఖాజాహుస్సేన్ పరిశీలకులుగా పాల్గొన్నారు. అనంతరం జరిగిన ప్రతినిధుల సభలో జెవివి నంద్యాల జిల్లా కార్యదర్శి మానిక్యశెట్టి కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. ప్రతినిధులు నివేదికపై చర్చించారు. రాజ్యాంగంలో సూచించినట్లు కర్ణాటక, మహారాష్ట్ర తరహాలో మూఢనమ్మకాల నిరోధానికి ప్రత్యేక చట్టం తేవాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జెవివి కర్నూలు అధ్యక్షులు సుధీర్‌రాజు ఆధ్వర్యంలో యూత్ చేసిన మ్యాజిక్ షోలు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు, పిఎన్ఎం కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆట, పాట అలరించాయి. ఈ కార్యక్రమంలో సిఐటియు నంద్యాల జిల్లా కార్యదర్శి నాగరాజు, యుటిఎఫ్ మాజీ రాష్ట్ర నాయకులు నరసింహులు, గోపాల్, రామరాజ, పునీత్, లతీఫ్, రామమూర్తి, సిఐటియు డోన్ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


పాల్గొన్న మహిళలు, విద్యార్థులు

నేడు ఉప సర్పంచి స్థానాలకు ఎన్నిక

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని 5 గ్రామపంచాయతీలకు నేడు సోమవారం ఉప సర్పంచులకు ఎన్నికలు జరగనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి మంజులవాణి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తపల్లి మండల కేంద్రం, ప్యాపిలి మండలం ఎన్.రంగాపురం, నందికొట్కూరు మండలం నాగటూర్, కొలిమిగుండ్ల మండలం అంకిరెడ్డిపల్లె, జూపాడుబంగ్లా మండలం జూపాడుబంగ్లా గ్రామ పంచాయతీలకు నేడు ఉప సర్పంచి ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు సర్వం సిద్ధం చేసినట్లు తెలిపారు.

54 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో విధుల పట్ల అలసత్వం వహిస్తూ గతవారం గైర్హాజరైన 54 మంది సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీస్‌లు జారీ చేసినట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరును రోజుకు మూడు సార్లు వేయాలి. ప్రతి రోజూ ఉదయం 10:30 గంటలలోపు ఒకసారి, మధ్యాహ్నం 2:30 నుండి 3 గంటల మధ్య స్పందన నిర్వహణ కోసం, సాయంత్రం 5 గంటల తర్వాత చివరిగా మూడోసారి నమోదు చేసుకోవాలని ప్రభుత్వం నిర్దేశించింది. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న నవరత్నాలు పథకం ద్వారా ప్రజలకు సత్వరమే సేవలు అందించాల్సి ఉంది. కొంతమంది సచివాలయ సిబ్బంది విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ గైర్హాజరు అవుతున్నారు. ఈ నెల 21 నుండి 26 వరకు వారం రోజులపాటు జిఎస్‌డబ్ల్యుఎస్ వెబ్‌సైట్ ఆన్‌లైన్‌లో నమోదైన హాజరును పరిశీలించగా 54 మంది సిబ్బంది వారంలో ఒక్కసారి కూడా బయోమెట్రిక్ హాజరు వేయలేదు. ఈ విషయంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ 54 మంది సచివాలయ సిబ్బందికి సంజాయిషీ కోరుతూ షోకాజ్ నోటీస్‌లు జారీ చేశారు. ఆళ్లగడ్డ, బనగానపల్లి, చాగలమర్రి, డోన్, కోవెలకుంట్ల, పగిడ్యాల, ప్యాపిలి, రుద్రవరం, బండి ఆత్మకూరు, గోస్పాడు, జూపాడుబంగ్లా, కొలిమిగుండ్ల, మిడుతూరు, పాణ్యం, సంజామల, సిరివెళ్ల మండలాల్లోని గ్రామ సచివాలయాల సిబ్బంది అయిన ఎనర్జీ అసిస్టెంట్‌లు, విఆర్వోలు, వార్డ్ వెల్ఫేర్ డెవలప్మెంట్ సెక్రటరీలు, పంచాయతీ సెక్రెటరీ, సర్వే అసిస్టెంట్లు, వెటర్నరీ ఫిషరీ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, మహిళా పోలీస్, వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, ఎంపీఈవో తదితర 54 మంది సచివాలయ సిబ్బందికి షో కాజ్ నోటీసులు జారీ చేశారు.

చౌడేశ్వరి దేవస్థానానికి విరాళం

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం శ్రీ చౌడేశ్వరి దేవస్థానానికి భక్తులు రూ.2.50 లక్షలు విరాళం ఇచ్చినట్లు ఈవో రామానుజన్ తెలిపారు. ఆదివారం కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన పల్లా రవీంద్రబాబు, తండ్రి పల్లా శేషయ్యలు ఆలయ అభివృద్ధి కోసం ఇఒ రామానుజన్, ఆలయ మాజీ చైర్మన్ పి.ఆర్ వెంకటేశ్వర రెడ్డిలకు విరాళం నగదును అందజేశారు.


చౌడేశ్వరి దేవస్థానానికి విరాళం ఇస్తున్న భక్తులు

ఉద్యోగం, ఉపాధి కల్పనలో పాలకులు విఫలం

- నిరుద్యోగులుగా రోడ్లపై తిరుగుతున్న యువత
- డివైఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు టి.రమేష్ కుమార్
- డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'విద్యారంగం-నిరుద్యోగం'పై సదస్సు

ప్రజాశక్తి - నంద్యాల

దేశ జనాభాలో 35 సంవత్సరాల వయసులోపు యువత 65 శాతం ఉన్నారని, వారికి ఉద్యోగం, ఉపాధి కరువై నిరుద్యోగులుగా రోడ్లపై తిరుగుతున్నారని డివైఎఫ్ఐ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు టి.రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని, డిగ్రీలు, పీజీలు చదివిన వారు కూలి పనులకు వెళుతున్నారని తెలిపారు. ఆదివారం నంద్యాల పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 'విద్యారంగ-నిరుద్యోగం' అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా టి.రమేష్ కుమార్ మాట్లాడారు. మోడీ 2014 ఎన్నికల సందర్భంగా సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత ఆచరణలో సంవత్సరానికి కనీసం రెండు లక్షల ఉద్యోగాలు కూడా కల్పించలేకపోవడం సిగ్గుచేటన్నారు. 2017-18లో 4 శాతంగా ఉన్న నిరుద్యోగం 2022లో 7శాతానికి పైగా పెరిగిందన్నారు. ఈ నాలుగేళ్ల కాలంలో ఒక కోటి యాభై లక్షల మంది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయారని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ కూలీలకు, పేదలకు ఉపాధి కల్పిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు క్రమేపి తగ్గించి ఎత్తివేయాలని బిజెపి ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. ఈ సంవత్సరం బడ్జెట్లో రూ. 30 వేల కోట్లు తగ్గించారని తెలిపారు. డివైఎఫ్ఐ మాజీ నాయకులు లక్ష్మణ్ మాట్లాడుతూ అంబానీ వంటి కార్పొరేట్లు, బడా పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం తప్ప, దేశ ప్రజల కష్టాలు తీర్చడం కోసం బిజెపి ప్రభుత్వం పని చేయడం లేదని విమర్శించారు. ఫ్యాక్టరీల మూత వలన కార్మికులు ఉద్యోగాలు కోల్పోతున్నారని, ప్రస్తుతం ఖాళీ పోస్టులు భర్తీ చేయకపోవడంతో లక్షలాది ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. మోడీ సర్కార్ లేబర్ కోడ్ తెచ్చి కార్పొరేట్లకు రక్షణ కల్పిస్తుందని అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నిరంజన్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేయడంలో ప్రచారాలకు, మాటల వరకే పరిమితమయ్యా యని, ఆచరణలో మాత్రం బలహీన పరుస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం కనీసం జూనియర్ కళాశాల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు ఇవ్వలేని స్థితిలో ఉందని, విద్యారంగంలో ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ మాట్లాడుతూ దళిత గిరిజన బ్యాక్‌లాగ్ పోస్టులు లక్షల సంఖ్యలో ఉన్నా ప్రభుత్వం భర్తీ చేయడం లేదన్నారు. సైన్యంలో రిక్రూట్మెంట్‌కు యువత ఎదురు చూసిన తరుణంలో అగ్నివీర్ నాలుగు సంవత్సరాల కాంట్రాక్ట్ ఉద్యోగాలకు తెరలేపడంతో దేశంలో యువత పెద్ద ఎత్తున తిరుగుబాటు చేసిందని తెలిపారు. అయినా మోడీ ప్రభుత్వం తన వైఖరి మార్చుకోకుండా మొండిగా అగ్నివీర్ రిక్రూట్మెంట్ అమలు చేసిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా పకోడీలు అమ్ముకొని బతకాలని కేంద్ర మంత్రి సిగ్గులేకుండా మాట్లాడి యువతను అవహేళనకు గురిచేశారన్నారు. డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ మాట్లాడుతూ యువతే దేశానికి వెన్నెముఖ అని ప్రగ్భలాలు పలికే పాలకులు ఆచరణలో యువతను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. వారి అసంతృప్తిని మతోన్మాదం వైపు మళ్లించి దేశ భవిష్యత్తుతో చెలగాటం ఆడుతోందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న మోసాన్ని ఎండగట్టాలని, అందుకోసం దేశంలోని విద్యార్థులు, యువకులు ఐక్యం కావాలని, పోరాడి ఉద్యోగాలు సాధించుకోవాలన్నారు. ప్రజలపై మోపుతున్న భారాలకు వ్యతిరేకంగా, విద్యుత్ చార్జీలు తగ్గింపునకు ప్రజలు ఆందోళనలకు సిద్ధపడాలని విజ్ఞప్తి చేశారు. నేడు కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో పెద్ద ఎత్తున విద్యార్థులు, యువకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



సదస్సులో మాట్లాడుతున్న టి.రమేష్ కుమార్

కమ్యూనిస్టు పార్టీ దమ్మున్నది

- అభివృద్ధి కోసం నిరంతర ఉద్యమాలు
- అప్పులు చేయడంలో బుగ్గన దిట్టా
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాశక్తి-డోన్

డోన్ కమ్యూనిస్టు పార్టీ దమ్మున్న పార్టీ అని, నిత్యం ప్రజా శ్రేయస్సు కోసం ఉద్యమాలు నిర్వహిస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. రాష్ట్రాన్ని రక్షించండి ...దేశాన్ని కాపాడండి... అంటూ చేపట్టిన బస్సు యాత్ర ఆదివారం డోన్ పట్టణానికి చేరుకుంది. దీంతో డోన్ మండల, పట్టణ శాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఏపీ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నాయకులకు కుంకుమ తిలకం దిద్ది ఆహ్వానం పలికారు. ప్రభుత్వ అతిథిగా గృహం నుండి రైల్వే స్టేషన్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రానికి సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగానాయుడు అధ్యక్షత వహించారు. రామకృష్ణ , సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి. రామచంద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి దుర్గ భవాని పాల్గొన్నారు. కె.రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో మోడీ....రాష్ట్రంలో జగన్ ప్రజలను అప్పుల ఊబిలోకి నెడుతున్నాడన్నారు. మోడీ, జగన్లను ఇంటికి పంపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జగన్,మోడీలు ఇద్దరు దోపిడి దొంగలుగా తయారయ్యారన్నారు. జగన్ రాష్ట్రాన్ని అప్పులలో ముంచితే...దాంట్లో బుగ్గన రాజారెడ్డి పాలుపంచుకుంటున్నడన్నారు. ఏప్రిల్ నుండి ఇప్పటివరకు ఐదు నెలల కాలంలో 55వేల కోట్లు అప్పులు తెచ్చారని అన్నారు. అప్పులు తేవడంలో బుగ్గన దిట్ట అయితే, పేకాట స్థావరాలు పెట్టి డబ్బులు సంపాదించడంలో మంత్రి గుమ్మనూరు దిట్ట అని ఎద్దేవా చేశారు.



మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

1.6 కేజీల వెండి పళ్లెం విరాళం

ప్రజాశక్తి - రుద్రవరం : మండలంలోని శ్రీ వాసాపురం వెంకటేశ్వర స్వామి ఆలయానికి రూ.1 లక్ష 38 వేల విలువ చేసే వెండి పళ్లెంను దాతలు విరాళంగా ఆదివారం అందజేశారు. ఆలమూరు గ్రామానికి చెందిన నారాయణ, నందమ్మల కుమారుడు వరుణ్ కుమార్, అతని భార్య అంజలిలు 1 కేజీ 600 గ్రాముల వెండి పళ్లెమును వెంకటేశ్వర స్వామి పూజ నిమిత్తమై ఆలయానికి విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, ప్రముఖ డాక్టర్ హరినాద్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ సింగతల మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షులు లింగం వెంకట రంగ నాయకులు శెట్టి, ఆలయ ప్రధాన అర్చకులు వారణాసి గోపి శర్మ, నల్లగట్ల వెంకట సుబ్బ నరసయ్య, నల్లగట్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


వెండి పళ్లెం విరాళంగా అందజేస్తున్న దాతలు

నాసిరకంగా జిఎన్ఎస్ఎస్ కాల్వ 'లైనింగ్'

- ఏడాది గడవకముందే పెచ్చులూడుతున్న వైనం
- లైనింగ్‌తో తగ్గుతున్న భూగర్భ జలాలు

ప్రజాశక్తి - బనగానపల్లె

గాలేరు నగరి సృజల స్రవంతి కాల్వ లైనింగ్ పనులు నాసిరకంగా చేయడంతో సంవత్సరం గడవక ముందే సిమెంట్ పగిలి, నెర్రలిచ్చి దెబ్బతింటోంది. గోరుకల్లు రిజర్వాయర్ నుండి అవుకు రిజర్వాయర్ వరకు 55 కిలోమీటర్లు జిఎన్ఎస్ఎస్ కాలువకు సుమారు రూ. 1500 కోట్లతో లైనింగ్ పనులు చేశారు. అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై లైనింగ్ పనులను నాసిరకంగా చేపట్టడంతోనే సంవత్సరం కూడా గడవక ముందే పెచ్చులూడిపోతుందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనులు చేసిన తర్వాత కాలువకు ఒక్కసారి కూడా నీళ్లు విడవలేదు. నీళ్లు విడవకముందే లైనింగ్ దెబ్బతిందంటే పనులు ఏమాత్రం చేశారో అర్థమవుతుంది. కాల్వకు నీళ్లు వదిలితే లైనింగ్ మొత్తం కొట్టుకుపోయే అవకాశం ఉంది.


జిఎన్ఎస్ఎస్ కాలువలో దెబ్బతిన్న లైనింగ్


యనకండ్ల వద్ద పూర్తిగా ధ్వంసమైన జిఎన్ఎస్ఎస్ కాలువ లైనింగ్

గోరుకల్లు రిజర్వాయర్ నుండి అవుకు రిజర్వాయర్, అక్కడి నుండి గండికోట వరకు జిఎన్ఎస్ఎస్ కాలువను 2007లో ఏర్పాటు చేశారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ ఎక్కువగా ఉన్నప్పుడు నేరుగా గోరుకల్లు రిజర్వాయర్ నుండి అవుకు రిజర్వాయర్ మీదుగా గండికోట రిజర్వాయర్‌కు తరలించేందుకు ఈ కాలువను ఏర్పాటు చేశారు. ఈ కాలువకు నీళ్లు విడుదల చేస్తే భూగర్భ జలాలు పెరిగి రైతుల బోర్ల కింద పంటలు పండించుకోవచ్చనే ఆశయంతో ఈ కాలువను ఏర్పాటు చేశారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవుకు రిజర్వాయర్ నుండి గోరుకల్లు రిజర్వాయర్ వరకు 55 కిలోమీటర్లు కాల్వకు లైనింగ్ పనులు చేశారు. దీంతో చుట్టుపక్కల పొలాల్లోని బోర్లలో భూగర్భ జలాలు పెరిగే అవకాశం లేకుండా పోయింది. నంద్యాల జిల్లాకు ఈ కాల్వ వల్ల ఒక ఎకరానికి కూడా నీరు పారదు. అయితే కాలువకు నీళ్లు విడిస్తే పాణ్యం, బనగానపల్లె మండలాలలో భూగర్భ జలాలు పెరిగి బోర్లలో నీరు పెరిగి తాగు, సాగునీటికి ఇబ్బందులు ఉండవని అధికారులు, ప్రజాప్రతినిధులు మొదట్లో పేర్కొన్నారు. జిఎన్ఎస్ఎస్ కాల్వకు ఒక్కసారి నీళ్లు వదిలితే సంవత్సరం పాటు భూగర్భ జలాలు పెరుగుతాయి. లైనింగ్ వేయడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో నీళ్లు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క లైనింగ్ పనులు నాసిరకంగా చేయడంతో చేసిన కొద్ది రోజులకే లైనింగ్ మొత్తం దెబ్బతిని పెచ్చులు ఊడిపోతున్నాయి. విజిలెన్స్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు తనిఖీలు చేస్తే అవినీతి బట్టబయలు అవుతుందని ఈ ప్రాంత ప్రజలు పేర్కొంటున్నారు. లైనింగ్ పనుల వల్ల ఎలాంటి ఉపయోగం లేదని రైతులు చెబుతున్నారు.

లైనింగ్ పనులతో తగ్గిన భూగర్భ జలాలు



జిఎన్ఎస్ఎస్ కాల్వకు లైనింగ్ పనులు చేయడంతో భూగర్భ జలాలు ఇంకిపోయి బోర్లు ఎండిపోతున్నాయి. లైనింగ్ వేయకుముందు సంవత్సరంలో నెల రోజులు జిఎన్ఎస్ఎస్ కాల్వకు నీళ్లు వదిలితే సంవత్సరమంతా బోర్లలో నీళ్లుఅందేవి. దీంతో పంటలు పండించుకునే వారం. లైనింగ్ పనులు చేస్తున్నామని గత సంవత్సరం కాలువకు నీళ్లు వదలలేదు. మరోపక్క వర్షాలు లేక బోర్లలో భూగర్భ జలాలు ఇంకిపోయి బోర్లు ఎండిపోవడంతో వేసిన పంటలన్నీ ఎండిపోయాయి. కాల్వలో వర్షపు నీరు పారినా బోర్లకు భూగర్భ జలాలు పెరిగేవి. లైనింగ్ వేయడం వల్ల భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. కాల్వకు నీళ్లు వదలడం వల్ల కాలువ కట్టలు దెబ్బ తినేవి కాదు. అనవసరంగా లైనింగ్ వేశారు.

- పెండేకంటి నాగసుబ్బయ్య రైతు యనకండ్ల.

నాసిరకంగా కాలువ లైనింగ్ పనులు



జిఎన్ఎస్ఎస్ కాల్వకు నాసిరకంగా లైనింగ్ వేయడంతో పగుళ్లు ఇచ్చి దెబ్బతింటుంది. లైనింగ్ పనుల వల్ల ఎలాంటి ఉపయోగం లేదు. లైనింగ్ వేయడం వల్ల భూగర్భ జలాలు ఇంకిపోయి బోర్లలో నీళ్లు ఎండిపోయాయి. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

- బండి మౌళేశ్వర రెడ్డి యాగంటి పల్లె.


పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న వైద్యులు

క్షయ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి - ఆత్మకూరు/కొత్తపల్లి

గ్రామాల్లో ఉన్న క్షయ వ్యాధిగ్రస్తులు జాగ్రత్తగా ఉండాలని అశ్విని హాస్పిటల్ వైద్యులు శ్రీనివాసరెడ్డి, ఊపిరితిత్తుల నిపుణులు పుల్లారెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని గోకవరం గ్రామంలో ఉన్న పుల్లారెడ్డి వైద్యశాలలో సేవా భారతి శ్రీ అశ్విని హాస్పిటల్ వారి సహకారంతో కొత్తపల్లి, ఆత్మకూరు మండలాలలో గల ఆరు పీహెచ్సీల పరిధిలో క్షయ వ్యాధి అనుమానిత వ్యక్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సను ప్రారంభించారు. అనంతరం పౌష్టికాహారం ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు విజయేంద్ర, రాయుడు సేవా భారతి ప్రతినిధులు వాసుదేవరెడ్డి, సత్యనారాయణ, టిబి యూనిట్ ఆత్మకూరు సూపర్వైజర్లు మస్తానయ్య, రవికుమార్, సౌజన్య రాణి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు నేడు సోమవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జగనన్నకు చెబుదాం- స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉదయం 9-30 గంటలకు జిల్లాధికారులందరూ హాజరు కావాలని తెలిపారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా యథాతథంగా జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహిస్తాం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

పట్టణంలో ఈ ఏడాది గణేష్ ఉత్సవాలను ఘనంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు శ్రీ గణేష్ ఉత్సవ కేంద్ర సమితి గౌరవాధ్యక్షుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త టీఎంసీ వేణుగోపాల్ తెలిపారు. ఆదివారం ఉత్సవ ఏర్పాట్లపై కేంద్ర సమితీ సభ్యులతో సమావేశం నిర్వహించి పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. పట్టణంలోని 40 కి పైగా కూడళ్లలో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారని, కేంద్ర సమితి నిర్ణయం మేరకు ప్రతి ఒక్క కమిటీ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ నెల 18న గణేష్ విగ్రహాల ప్రతిష్ట పూజా కార్యక్రమాలు, 22న నిమజ్జనం ఉంటాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాదులు నీలకంఠేశ్వరం, తిరుపాల్ రెడ్డి, సోముల శ్రీనివాసరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

రూ. 20 లక్షలతో పార్కులో మౌలిక వసతులు

- డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

ప్రజాశక్తి- డోన్

డోన్ పట్టణంలోని మహాలక్ష్మి హాస్పిటల్ సమీపంలో ఉన్న మున్సిపల్ పార్కులో రూ. 20 లక్షలతో ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. ఆదివారం పార్కులో రూ. 20 లక్షలతో నిర్మిస్తున్న కాఫీ షాప్‌నకు, టాయిలెట్ బ్లాక్ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కుకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పార్కులో ప్రజల సౌకర్యార్థం మహిళలకు, పిల్లలకు కాఫీ షాప్, టాయిలెట్ బ్లాక్ నిర్మిస్తున్నామని తెలిపారు. సేద తీరేందుకు అన్ని మౌలిక వసతులను కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, ఏఈ సురేష్, మున్సిపల్ వైస్ చైర్మన్ ఎస్ఎండి జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు మల్లికార్జున రెడ్డి, నాగేంద్ర, కటికే వేణు, మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు వైఎస్ఆర్ రఫి, కుమ్మరి రాజు, వైసిపి నాయకులు కాలేషా, మేకల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


పార్కులో భూమి పూజ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్

వచ్చే ఎన్నికల్లో టిడిపిని గెలిపించండి : బిసి ఇందిర

ప్రజాశక్తి - సంజామల

వచ్చే ఎన్నికల్లో టిడిపికి ఓటు వేసి గెలిపించాలని బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి సతీమణి బిసి ఇందిరా ప్రజలను కోరారు. ఆదివారం సంజామలలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి వెళ్లి టిడిపి మేనిఫెస్టోను వివరించారు. ఉచితంగా మూడు సిలిండర్లు, స్త్రీలకు ఉచిత బస్సు పాస్ ప్రయాణం, భార్యకు, భర్తకు పింఛన్లు అందించనున్నట్లు తెలిపారు. వచ్చే ఎన్నికలలో మహిళలు చైతన్యవంతులై టిడిపికి ఓటు వేసి గెలిపించాలని, బనగానపల్లె నియోజకవర్గ ఎమ్మెల్యేగా బిసి జనార్దన్ రెడ్డిని గెలిపించాలని మహిళలను కోరారు. కార్యక్రమంలో నాయకులు తోకల మద్దిలేటి, మల్కి హుసేని, మాధవ, పొంతాల లోకేష్, మహిళలు పాల్గొన్నారు.


మహిళలతో మాట్లాడుతున్న బిసి ఇందిరమ్మ

నేడు ధర్నాను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి - నంద్యాల

ప్రజా సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి కార్యక్రమంలో భాగంగా నేడు నంద్యాల మండల కార్యాలయం ముందు జరుగు ధర్నాలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు, కార్యదర్శి వర్గ సభ్యులు కేఎండి గౌస్, డి.లక్ష్మణ్‌లు కోరారు. ఆదివారం స్థానిక సిపిఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ధరలు తగ్గించాలని, ఉద్యోగాలు ఇవ్వాలని, కరెంటు చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల రోజు రోజుకి నిత్యవసర వస్తువులు ధరలు అదుపు లేకుండా ఆకాశాన్ని అంటుతున్నాయని అన్నారు. 450 ఉన్న గ్యాస్ ధర రూ. 1200కు పెరిగిందని, కాయగూరలు, పప్పులు, నూనెలు 50 శాతం వరకు పెరిగాయని పేర్కొన్నారు. ధరలను అదుపు చేయాల్సిన కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు బడా వ్యాపారులకు కొమ్ము కాస్తున్నాయని విమర్శించారు. 2014 నుండి నిరుద్యోగులను మోసగిస్తూనే ఉందన్నారు. ప్రజలపై ప్రభుత్వాలు మోపుతున్న భారాలపై ఆగస్టు 30 నుండి సెప్టెంబర్ 1 వరకు సంతకాల సేకరణ, సచివాలయంలో వినతులు, అర్జీలు వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలను వీటిపై కదిలించేందుకు కృషి చేశామన్నారు. ప్రజలు అన్నిచోట్లా కదిలి సచివాలయం వద్ద నిరసన కార్యక్రమాలు చేశారని, నేడు తహశీల్దార్ ఆఫీస్ వద్ద జరగబోయే కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం పట్టణ కార్యదర్శి నరసింహ


మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట కార్యదర్శి నాగమణి

అక్రమ బదిలీలు పారదర్శకత పాలనలో భాగమా..?

- యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి

ప్రజాశక్తి - నంద్యాల

ఉపాధ్యాయులకు సాధారణ బదిలీలు నిర్వహించి రెండు మాసాలు కూడా గడవకముందే, జీతాలు కూడా తీసుకోక ముందే తమ అనుయాయులకు, పైరవీకారులకు ప్రభుత్వ ఉత్తర్వుల ద్వారా అక్రమ బదిలీలు నిర్వహించడం పారదర్శకత పాలనలో భాగమా అని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.నాగమణి, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పివి ప్రసాద్, జె.సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీశారు. ఆదివారం స్థానిక యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారదర్శకత పాలనకు మారుపేరని పదేపదే ప్రకటించుకునే రాష్ట్ర ప్రభుత్వం కొందరు ఉపాధ్యాయుల పైరవీలకు తలొగ్గి కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ దొడ్డి దారిన అక్రమ బదిలీలు నిర్వహించడం దుర్మార్గమన్నారు. సిఫార్సు బదిలీల వల్ల ఉపాధ్యాయులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు. సాధారణ ఉపాధ్యాయ బదిలీల్లో కేటగిరి-1, 2లలోని కొన్ని స్థానాలను బ్లాక్ చేసి వాటిని ఇప్పుడు సిఫార్సు ద్వారా భర్తీ చేయడం సిగ్గుచేటన్నారు. సాధారణ బదిలీలకు ముందు నుండి అక్రమ బదిలీలను చేపడుతున్న రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు మళ్లీ వందల మందికి సిఫార్సు బదిలీలు చేపడుతూ డిఇఒలకు రహస్య ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం తక్షణమే సిఫార్సు బదిలీలను రద్దుచేసి తమ పారదర్శకతను, చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. లేనిపక్షంలో ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్.జాకీర్ హుస్సేన్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.సత్య ప్రకాశ్, ఆర్థిక కార్య దర్శి ఎస్.బాబా పక్రుద్దీన్, జిల్లా కార్యదర్శులు షమీమ్ బాను, వివి రామ్ మోహన్, పిసిహెచ్ బాలస్వామి, రామ కృష్ణుడు, గోపాల్, పివి రామక్రిష్ణ రెడ్డి, వైవి రమణ, ఎస్.నర సింహా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో పెరిగిన భక్తుల సందడి

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రావణమాసం పురస్కరించుకొని ఆదివారం శ్రీశైల క్షేత్రంలో భక్తుల సందడి పెరిగింది. స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు తెలుగు రాష్ట్రాల నుండి కాక పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో శ్రీశైలం చేరుకున్నారు. భక్తుల రద్దీని దష్టిలో పెట్టుకొని తెల్లవారుజామున 4-30 గంటలకు ఆలయ ద్వారాలు తెరచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర క్యూలైన్లలో భక్తులకు అనుమతి ఇచ్చారు. క్యూ కాంప్లెక్స్‌లోకి వచ్చిన భక్తులకు మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లు అందజేశారు. స్వామి అమ్మవారిని దర్శించుకునేందుకు సుమారు రెండు గంటల సమయం పడుతుంది. భక్తులు అడిగిన అన్ని ఇచ్చేందుకు లడ్డు ప్రసాదాలు అందుబాటులో ఉంచారు. అన్నపూర్ణ భవనంలో భక్తులకు ఉచిత అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలతోటి చేసుకోకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిగా కెమెరాలతో కంట్రోల్ రూమ్‌లో ఎప్పటికప్పుడు దేవస్థానం అధికారులు పర్యవేక్షిస్తున్నారు. క్షేత్ర పరిధిలో ఉన్న కమ్యూనిటీ సత్రాలు, దేవస్థానం గదులు, కాటేజీలు భక్తులతో నిండిపోయాయి.

దళితులను అవమానిస్తే సహించం

- ఎమ్మెల్యే ఆర్థర్‌కు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలి
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు డిమాండ్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

నందికొట్కూరు మార్కెట్ యార్డ్ ప్రమాణ స్వీకారోత్సవానికి ప్రోటోకాల్ ప్రకారం ఎమ్మెల్యే తోగూరు ఆర్థర్ దళితుడనే కారణంతో పిలవకుండా అవమానించడాన్ని సహించబోమని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పేర్కొన్నారు. బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఎమ్మెల్యేకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలో దళిత ఐక్య కార్యచరణ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు లింగస్వామి అధ్యక్షతన గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ఆధ్వర్యంలో పలు దళిత, గిరిజన ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ మాట్లాడారు. నందికొట్కూరులో ప్రోటోకాల్ పాటించని అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలన్నారు. కేవలం దళిత ఎమ్మెల్యేలున్న నియోజకవర్గాల్లో పార్టీ ఇన్చార్జిలుగా అగ్రవర్ణాల వారిని వైసిపి నియమించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాలకు దళిత ఎమ్మెల్యేకు పోను మిగతా నియోజకవర్గాల్లో కూడా చేతనైతే స్థానిక ఎమ్మెల్యేలకు కాదని ఇతరులకు పార్టీ ఇన్చార్జిలుగా నియమించాలని సవాల్ విశారు. అనంతరం జిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి రవి నాయక్, డుమావత్ స్వామి నాయక్, దళిత ఐక్య సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ, గిరిజన దళిత సంఘాల నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో జిపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్, వెంకటేశ్వర నాయక్, గుర్రం లక్ష్మి, విజయ కుమారి, అయ్య స్వామి, రాంప్రసాద్ సీనియర్ న్యాయవాది, ప్రవీణ్ మాల మహానాడు, భీమవరం దేవదాస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, బెల్లం రాజ్ కుమార్ రాష్ట్ర కార్యదర్శి మాల మహానాడు, చిరంజీవి, ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు, ప్రేమ్ కుమార్, కృష్ణ, దళిత సమాఖ్య జిల్లా అధ్యక్షుడు, పుల్లన్న క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు



ఘనంగా ముగిసిన మహా సంప్రోక్షణ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

మండలంలోని ప్రముఖ నవ నారసింహ క్షేత్రమైన అహోబిలం మాలోళ లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో మూడు రోజుల పాటు జరిగిన అష్ట బంధన మహా సంప్రోక్షణ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా ముగిసాయని దేవస్థానం ప్రధాన అర్చకులు కీడాంబి వేణుగోపాలస్వామి తెలిపారు. కాంచీపురం శ్రీరంగం నుంచి వచ్చిన వేదపండితుల ఆధ్వర్యంలో హోమ కార్యక్రమాలు నిర్వహించారు. 2003లో అప్పటి 45వ పీఠాధిపతి శ్రీ నారాయణ యతీంద్ర మహాదేశికన్ స్వామి ఆధ్వర్యంలో సంప్రోక్షణ జరిగిందని, మళ్లీ రెండు దశాబ్దాల తర్వాత సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామని ప్రధాన అర్చకులు తెలిపారు.

సమాజ సేవకు సిద్ధం : జనసేన

ప్రజాశక్తి - బేతంచర్ల

రాష్ట్రంలో సమాజ సేవ చేయడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారని జనసేన పార్టీ జిల్లా నాయకులు వట్టినెల నాగరాజు, మండల నాయకులు మద్దిలేటి తెలిపారు. జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు పురస్కరించుకొని బేతంచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా చిన్న హైస్కూల్ ఆవరణలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బేతంచెర్ల ఎస్సై శివ శంకర్ నాయక్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 44 యూనిట్ల రక్తదానం యువత చేసినట్లు వారు తెలిపారు. డోన్ నియోజకవర్గం వీర మహిళ చాముండేశ్వరి, శ్రీకంటి మధు, నాయిని రామకృష్ణ, ఆవుల రాజశేఖర్, రంగాపురం మధు, పోల మధు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మేము ప్రజల పక్షానే.. జమిందారీ పక్షాన కాదు..

- టిడిపి డోన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధర్మవరం సుబ్బారెడ్డి

ప్రజాశక్తి-డోన్

టిడిపి నిరంతరం ప్రజల పక్షాన ఉంటుందని, జమిందారుల పక్షాన కాదని డోన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి అన్నారు. ఆయన స్వగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆర్థికశాఖమంత్రి బుగ్గన మతిస్థిమితం లేక ఒక రోజు పాణ్యం నియోజకవర్గంలో విమానాశ్రయం తామే కట్టామని, ఇంకో రోజు ఎమ్మిగనూరుకు పోయి గాజులదిన్నె ప్రాజెక్టు కట్టామని అంటున్నారని ఎద్దేవా చేశారు. పేద ప్రజలకు ఇంటి నివాసం ఉండేందుకు స్థలాలు ఇస్తామన్న రోజు నుంచే ఆర్థిక మంత్రి బుగ్గనకు ఓటమి భయంతో ఏదేదో మాట్లాడుతున్నారని అన్నారు. తాము అప్పటి నుండి ఇప్పటివరకు అడుగుతున్నది ఒకటేనని, శేషారెడ్డి హైస్కూల్ 'మీ తాత గారు దానం చేశారని, నువ్వు గత రెండు ఎన్నికల్లో వాడుకొని గెలిచావు.. ఇప్పుడు నువ్వు వెనక్కి తీసుకున్నావా' అని అడిగితే దానికి సరైన సమాధానం చెప్పకుండా మాట దాట వేస్తున్నారని అన్నారు. ప్రతిపక్ష నాయకుడిగా తాను ప్రశ్నిస్తానని, దానికి బుగ్గన సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. నిధులు మంజూరు కాకుండా ఇక్కడ శిలాఫలకాలు, భూమి పూజలు చేయడం సరైనది కాదని, తాము సెల్ఫీ చాలెంజ్ కార్యక్రమం ద్వారా ప్రశ్నించామని, మీ దగ్గర ఏదైనా ఆధారాలు ఉంటే జిఒలు చూపించాలని, అవేవీ మాట్లాడకుండా పనులు మొదలు పెట్టారని, ఒక ఆర్థికమంత్రి అబద్ధాలు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. జగనన్న కాలనీలో రైతులకు, ఉడుములపాడు రైతులకు వారి భూములు తీసుకోని నష్టపరిహారంలో కూడా కమీషన్‌లు దండుకున్నారని దొరపల్లె బాధిత రైతు రంగరత్నం, ఉడుములపాడు బాధిత రైతులు రాజు, తిరుపాలు, రామాంజనేయులు వాపోయారని తెలిపారు. డోన్ నియోజకవర్గ ప్రజలు తెలుగుదేశంపార్టీని గెలింపిచడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు.


మాట్లాడుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి

దూదేకుల జనాభాను తేల్చాలి

- దూదేకుల సంఘం నాయకులు - ప్రమాదంలో మృతి చెందిన వారి కుటంబానికి ఆర్థికసాయం


అవుకుకు చెందిన దూదేకుల వారికి ఆర్థిక సహాయం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రాష్ట్ర వ్యాప్తంగా కులగణ చేపట్టి దూదేకుల కుల జనాభాను తేల్చాలని నూర్ బాషా, దూదేకుల బిసి, మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని ఎన్జీవోస్ కాలనీ నేషనల్ పీజీ కళాశాలలో నూర్ భాషా దూదేకుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి దూదేకుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ బాబాన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పీర్ మొహమ్మద్, సలీం, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మ మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా నూరు బాషా, దూదేకులు 20 లక్షల మంది ఉంటే కేవలం నాలుగు లక్షల మంది ఉన్నట్లు అధికారిక లెక్కలు చూపడం దారుణం అన్నారు. రాజకీయాల్లో ఈ సామాజిక వర్గానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రాష్ట్రంలో దూదేకుల వర్గానికి నాలుగు ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ స్థానం కేటాయించాలని, ఇచ్చిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. అనంతరం దూదేకుల డిమాండ్స్‌పై కరపత్రాలును ఆవిష్కరించారు. అనంతరం నెల రోజుల వ్యవధిలో రోడ్డు ప్రమాదంలో ఇద్దరు కుటుంబ సభ్యులను కోల్పోయిన అవుకుకు చెందిన దూదేకుల వారికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో దూదేకుల సంఘం పట్టణ కమిటీ వాసవి దస్తగిరి అధ్యక్షుడు, ఆదాం సాహెబ్, ప్రధాన కార్యదర్శి సోమశేఖర్, కోశాధికారి, ఆర్గనైజింగ్ సెక్రెటరీలు హుసేనప్ప, బాలు, హుస్సేన్, క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో నూర్ బాషాలకు, దూదేకులకు 4 ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలు కేటాయించాలి

రాబోయో ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు దూదేకుల కులస్తులకు రాష్ట్రంలో 4 ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ స్థానం కేటాయించాలని, అభ్యర్థులను గెలిపించుకొనే భాద్యత ఆయా పార్టీలు తీసుకోవాలని దూదేకుల ఫెడరేషన్ మాజీ చైర్మన్ పి.బాబాన్, రాష్ట్ర అధ్యక్షులు పీర్ మొహమ్మద్, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు మస్తానమ్మలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని ఎన్జిఒ కాలనీలో ఉన్న నేషనల్ పిజి కాలేజీలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నూర్ బాషా, దూదేకుల ఆత్మీయ సమావేశంలో పాల్గొనేందుకు వచ్చిన రాష్ట్ర నాయకులు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. రాష్టంలో 60 లక్షల ముస్లిం జనాభాలో 20 లక్షలు దూదేకుల, నూర్ బాషాలు ఉన్నారని తెలిపారు. ముస్లిములకు ఏఏ పథకాలు అమలు చేస్తున్నారో వాటన్నింటినీ దూదేకుల నూర్ బాషాలకు వర్తించేలా చూడాలన్నారు. జనాభా దామాషా ప్రకారం చట్ట సభల్లో అవకాశం కల్పించాలన్నారు. రాష్ట్రంలో 4 ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానాలు కేటాయించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం, రాష్ట్ర కోశాధికారి డాక్టర్ దస్తగిరి పర్ల, రాష్ట్ర యూత్ అధ్యక్షులు డి పెద్ద మస్తాన్, రాష్ట్ర ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సిద్దయ్య, రాయలసీమ రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు ఇదాదుల్లా, సుభాహన్, ఖాదర్ బాషా రాష్ట్ర అధికార ప్రతినిధి హన్ను బాయ్ తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు భరోసా టిడిపితోనే

- మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి

ప్రజాశక్తి - అవుకు

ఆంధ్రప్రదేశ్ ప్రజల భవిష్యత్తు, రాష్ట్ర భవిష్యత్తు ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం అవుకు మండలం గోకులదిన్నె గ్రామంలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మీ భవిష్యత్తు భరోసా కొరకు ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి, బీసీ రామనాథ్ రెడ్డిలు గ్రామానికి చేరుకోగానే పార్టీ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో ఘన స్వాగతం పలికారు. గ్రామంలోని ప్రతి ఇంటింటికి వెళ్లి టిడిపి ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీల్లోని సంక్షేమ పథకాలను వివరించి రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


తెలుగుదేశం పార్టీ చేపట్టబోయే పథకాల బుక్ లెట్‌ను అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి